@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

ఆదివారం
18 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :106
పేజీలు : 12 వెల : 5/-






PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |


# విద్యుత్ డిమాండ్‌పై ప్రత్యేక దృష్టి

- నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం కల్పించండి!
- యువ కళాకారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు..
- ఎల్‌నినో ప్రభావంతో అక్టోబర్‌లోనే పెరిగిన విద్యుత్ డిమాండ్
- నీరు, విద్యుత్ పొదుపుపై సినీ ప్రముఖులు ప్రచారం చేయాలి
- యువ ఫిల్మ్ మేకర్స్‌కు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికల ప్రదానం
- ప్రతిభ ఉంటే యువతను ఆపలేరు: ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు

ప్రజల్లోకి బలమైన సందేశం తీసుకెళ్లాలి



హైదరాబాద్

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు యువ కళాకారులు ముందుకు రావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాజంలో ప్రజలకు చేరువయ్యేలా సందేశాలను అందించడంలో సినీ పరిశ్రమకు, యువ దర్శకులకు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు విశేషమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ మార్పుల - మిగతా 11లో



# న్యాయం కోసం నిలబడండి

- విద్యార్థులకు సీజేఐ సూర్యకాంత్ సూచన
- న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు న్యాయం కోసం నిలబడాలి
- రాజ్యాంగ విలువలను కాపాడాలని
- భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సూచన
- వృత్తిలో నిజాయతీగా ఉంటూ, ఇతరుల సమస్యలను అర్థం చేసుకోవాలి



# ఫిబ్రవరి నెలలోనే వేసవి పరిస్థితులు

- ఎల్‌నినో తెచ్చిన ముప్పు
- ఫిబ్రవరిలోనే వేసవి ప్రారంభం!
- ఎల్‌నినో ప్రభావంతో శీతాకాలం కూడా అధిక ఉష్ణోగ్రతలతో ఎండాకాలంగా మారనుందని క్లైమేట్ ట్రెండ్స్ నివేదిక వెల్లడి
- 1901 తర్వాత అత్యంత వేడినెలగా 2026 ఆగస్టు రికార్డు సృష్టించింది.
- ఎల్‌నినో ప్రభావంతో ముందుగానే వేసవి ప్రారంభం

హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో శీతాకాలం కూడా అధిక ఉష్ణోగ్రతలతో ఎండాకాలంగా మారనుందని క్లైమేట్ ట్రెండ్స్ అధ్యయన నివేదిక వెల్లడించింది. అలాగే 1901 తర్వాత అత్యంత వేడి నెలగా 2026 ఆగస్టు రికార్డు సృష్టించింది. ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ఫిబ్రవరి నెలలోనే వేసవి పరిస్థితులు తలెత్తుతాయని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ నివేదించింది. 1950 తర్వాత భారతదేశానికి ప్రస్తుత ఎల్‌నినో అత్యంత తీవ్రమైన ముప్పుగా పరిణమించిందని, ఇప్పటికే వర్షపాత - మిగతా 3లో



# సీఆర్పీఎఫ్ జవాన్లకు గుడ్ న్యూస్

- సీఆర్పీఎఫ్‌లో లాన్స్ నాయక్, నాయక్ ర్యాంకుల పునరుద్ధరణకు యోచన
- జవాన్ల పదోన్నతుల్లో జాప్యాన్ని తగ్గించేందుకు కీలక ప్రతిపాదన
- దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దయిన ర్యాంకులను మళ్లీ తెచ్చేందుకు కసరత్తు
- త్వరలో దళంలో చేరనున్న అగ్నివీరులకు లబ్ధి చేకూర్చే అవకాశం
- దేశవ్యాప్తంగా సైనిక్ సమ్మేళన్ల ద్వారా అభిప్రాయ సేకరణకు ఆదేశం

# యూపీ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ వ్యూహం

- యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామికే మళ్లీ పగ్గాలు!
- యూపీ, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ నాయకత్వంపై స్పష్టత
- యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి సారథ్యంలోనే బరిలోకి
- నాయకత్వ మార్పు ఉంటుందన్న ఊహాగానాలకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- లోక్‌సభ ఫలితాల తర్వాత యూపీ నాయకత్వంపై ప్రత్యేక దృష్టి
- త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం



# హనుమకొండలో ఐటీ టవర్స్



- శుభవార్త చెప్పిన మంత్రి శ్రీధర్ బాబు
- హనుమకొండ ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు శుభవార్త
- హన్మకొండలో ఐటీ టవర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- తాజాగా హనుమకొండలో మంత్రి పర్యటించారు
- ఈ సందర్భంగా టీ స్టాల్ దగ్గర టీ తాగుతూ యువకులతో ముచ్చట

హైదరాబాద్

ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడంతో పాటు మత్తుకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ హనుమకొండలో నిర్వహించిన మారథాన్‌లో ఓరుగల్లు ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్ చైర్మన్ మీూూ నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ మారథాన్‌లో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. యువతతో కలిసి రన్నింగ్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు.. బాలసముద్రంలో ఓ టీస్టాల్ వద్ద ఆగి సరదాగా గడిపారు. టీ తాగుతూ సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు - మిగతా 3లో



# బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత

- బలూచిస్తాన్‌లో 20 మంది పోలీస్ రిక్రూట్‌లను అపహరించిన సాయుధులు
- ఇది బలోచ్ వేర్పాటువాదుల పనేనని అనుమానం
- రాష్ట్రంలో బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాలపై తీవ్ర ఆరోపణలు
- పాక్ భద్రతా బలగాల ఆధీనంలో పలువురు టీచర్ల మృతి చెందినట్లు ఆరోపణలు
- మస్తుంగ్ జిల్లాలో గాలింపు చర్యలు ముమ్మరం చేసిన పాక్ సైన్యం

# బ్యారేజీల మరమ్మతుపై తర్జనభర్జన!

- కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు
- పాత గుత్తేదారులకే ఇవ్వాలా?
- కొత్త టెండర్ని పిలవాలా?
- కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల అంశంలో అధికారులు తర్జనభర్జనలు
- తొలుత రూ.2500 కోట్ల ఖర్చువతుందని తొలుత అంచనా
- అయితే ఇంకా ఎక్కువే వ్యయమయ్యే అవకాశముందని ప్రస్తుతం భావిస్తున్నారు



హైదరాబాద్

కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతుల పనులు పాత గుత్తేదారులకే ఇవ్వాలా? లేక టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించాలా? అన్నదానిపై నీటిపారుదల శాఖ తర్జనభర్జనలు పడుతోంది. ఓ వైపు పాత గుత్తేదారులతో చర్చలు జరుపుతున్నా, మరోవైపు మంత్రివర్గం ఎలాంటి నిర్ణయం తీసుకొంటుందో అన్న ఆందోళనలో ఉంది. మేడిగడ్డ పునరుద్ధరణతో సహా మూడు బ్యారేజీల మరమ్మతులకు సుమారు రూ.2500 కోట్లు వ్యయమయ్యే అవకాశం ఉందని మొదట తాత్కాలికంగా అంచనా వేసినా, తాజాగా ఇంకా ఎక్కువ కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు మరమ్మతులకు సంబంధించి డిజైన్లు, డ్రాయింగ్స్ పూర్తయితే కానీ అంచనాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. తాజా ధరలతో అంచనాలు తయారు చేయాల్సి ఉంది. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ అంచనా ఖర్చులో 50-60 శాతానికి పైగా ఖర్చయ్యే పునరుద్ధరణ పనులను టెండర్? లేకుండా నామినేషన్?పై ఇస్తే వచ్చే సమస్యలను కూడా నీటిపారుదల శాఖ పరిశీలిస్తోంది. పైగా సిఫార్సుల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్న, ప్రభుత్వంపై కోర్టుకెళ్లిన వారికి ఇస్తే ఏమైనా ఇబ్బందులు వస్తాయా అని కూడా - మిగతా 11లో



# ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్‌లోనూ ఈడీ మెరుపుదాడులు...
- హైదరాబాద్ సహా ఐదు నగరాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ దాడులు
- అక్టోబర్ 13న 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు
- దుబాయ్ కేంద్రంగా బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు సాగుతున్నట్లు గుర్తింపు
- షెల్ కంపెనీలు, క్రిప్టో కరెన్సీ ద్వారా నిధులను విదేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడి
- కేసుతో సంబంధం ఉన్న పలు బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన ఈడీ

# సంపాదకీయం

## మోదీ ట్రాప్‌లో కాంగ్రెస్ !

యుద్ధరంగానికి వెళ్లేటప్పుడు శత్రువు ఎవరో, అతడి వ్యూహం ఏంటో తెలియనంత వరకు ఏ సైన్యమూ విజయ తీరాలకు చేరలేదు."ఇది రాజకీయాలకూ వంద శాతం వర్తిస్తుంది. భారత రాజకీయ చరిత్రలో శతాబ్దానికి పైగా మూలాలున్న గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్, ప్రస్తుతం తన రాజకీయ దిశనూ, దశనూ పూర్తిగా కోల్పోయిన పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పన్నుతున్న రాజకీయ వ్యూహాలను అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం దారుణంగా విఫలమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోదీ నిర్దేశించిన రాజకీయ బాటలోనే నడుస్తూ, ఆయన చేతిలో ఓ పకడ్బందీ కీలుబొమ్మలా మారిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఈవీఎంల పనితీరుపై రచ్చ చేస్తూ, భారత ఎన్నికల సంఘంపై , సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ సమరం ప్రకటించింది. ఎన్నికల సంఘాన్ని కేవలం బిజెపి మరొక అనుబంధ విభాగంగా ముద్రవేస్తూ ప్రజల్లోకి వెళ్లేందుకు తాపత్రయపడుతోంది. ఇక్కడే కాంగ్రెస్ తన ప్రాథమిక లాజిక్‌ను మిస్సయ్యింది. ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఢీకొట్టాల్సింది బిజెపి అనే ప్రత్యర్థి పార్టీని మాత్రమే. కానీ ప్రజాస్వామ్య మూలస్తంభమైన ఎన్నికల సంఘాన్ని బిజెపి రూపంగా చిత్రీకరిస్తూ పోరాడటం ఎంతవరకు సమంజసం?. భారతీయ ఎన్నికల వ్యవస్థ అంత సులువుగా ఫలితాలను మార్చేసే లేదా ప్రభావితం చేసే బలహీనమైన వ్యవస్థ కాదనే సత్యం సగటు పౌరుడికి తెలుసు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పోలింగ్ సిబ్బంది, బూత్ లెవెల్ ఆఫీసర్లు , వివిధ పార్టీల ఏజెంట్లు కలసి క్షేత్రస్థాయిలో ప్రక్రియను నిర్వహిస్తారు. లక్షల సంఖ్యలో ఉండే క్షేత్రస్థాయి సిబ్బంది ఏదో ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాస్తూ, ఓట్లు తీసేయడమో లేదా వేయడమో ఓ ఆదేశంతో చేయడం అసాధ్యం. అంత పెద్ద ఎత్తున అక్రమాలు చేయడం క్షేత్రస్థాయిలో సాధ్యం కాదన్న క్లారిటీ సామాన్య పౌరులకు ఉంది. కానీ, ఈ చిన్న విషయాన్ని పక్కనబెట్టి, ఎన్నికల సంఘాన్ని బూచిగా చూపిస్తూ రాజకీయం చేయడమే బిజెపి పరిచిన అసలైన ట్రాప్ . ఈ ట్రాప్‌లో పడిన కాంగ్రెస్, ప్రజా సమస్యలను వదిలేసి, ఈసీ రాజీనామాల చుట్టూ తిరుగుతూ రోజురోజుకు ప్రజలకు మరింత దూరమవుతోంది. ఈ వాఖీ ప్రక్రియ , ఈసీ వ్యతిరేక ఉద్యమాల వల్ల సామాన్య ప్రజల జీవనంలో ఎలాంటి అలజడీ లేదు. విపక్షాలు చెప్తున్న ఆరోపణలతో సగటు పౌరులు ఏమాత్రం ప్రభావితం కాలేదు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేపడుతున్న ఈ ఉద్యమాలకు ఎలాంటి ప్రజాదరణ లభించడం లేదు. స్థానిక నేతలు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు ఢిల్లీ వీధుల్లోకి వచ్చి లేదా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా, ప్రజలు వాటిని పట్టించుకోవడం లేదు. ఇక్కడొక చేదు రాజకీయ సంకేతాన్ని కాంగ్రెస్ గమనించాల్సి ఉంది. చాలా వరకు ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అట్టడుగు స్థాయిలో ఉనికే కరువైంది. కాంగ్రెస్ పార్టీకి కొంతమేర బలం ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో, వారు చేస్తున్న ఈ ఉద్యమానికి ఉనికి లేకుండా పోయింది. పార్టీ ఉనికి ఉన్న చోట ఉద్యమానికి స్పందన లేకపోవడం, ఉద్యమం నడిపించాలని చూస్తున్న చోట పార్టీకే పునాదులు లేకపోవడం దేనికి సంకేతం? కాంగ్రెస్ పూర్తిగా ప్రజా పునాదిని కోల్పోయిందనడానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం కాదా? బిజెపి విసురుతున్న తీవ్ర హిందూత్వ భావజాలాన్ని తట్టుకోవడానికి, దానికి కౌంటర్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకుంది. అగ్రనేతలు రాముడు, శివుడు అంటూ కొత్త రాజకీయం ప్రారంభించారు. శివుడు మా దేవుడు అంటూ ప్రకటనలు చేస్తున్నారు. గుళ్ల చుట్టూ తిరగడం, కొత్త దీర్ఘాలు తీయడం ప్రారంభించారు. బిజెపి నిర్మించిన అదే పిచ్‌పై బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యూహం వల్ల కాంగ్రెస్‌కు ఒరిగింది ఏమీ లేదు సరే కదా, ఉన్నది ఊడింది. సాంప్రదాయ ముస్లిం ఓటర్లలో అసంతృప్తికి ఇది కూడా ఓ కారణం. కాంగ్రెస్ అవకాశవాద హిందూత్వ ధోరణిని చూసి ముస్లింలు ఆ పార్టీకి దూరమై, సొంత ప్రాంతీయ శక్తులను ఆశ్రయిస్తున్నారు. సాఫ్ట్ హిందూత్వ నాటకాలను అసలైన హిందూ ఓటర్లు ఎంతమాత్రం నమ్మడం లేదు. ఒరిజినల్ హిందూత్వ బ్రాండ్ అందుబాటులో ఉన్నప్పుడు, నకిలీ సాఫ్ట్ వెర్షన్‌ను వారెందుకు ఆదరిస్తారు?. ఫలితంగా, బిజెపి పరిచిన మార్గంలోనే పయనిస్తూ కాంగ్రెస్ పార్టీ తన పరిధిని నిరంతరం కుంచించుకుపోయేలా చేసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ పెద్దలు గుండెల మీద చేయి వేసుకుని, తమ సామాజిక ఓటు బ్యాంక్ పునాదులు ఎలా కదిలిపోయాయో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ సామాజిక వర్గం ఈ రోజు కాంగ్రెస్‌తో ఉంది?. ఓసీలు ఎప్పుడో కాంగ్రెస్ కు దూరమయ్యారు. బిజెపి లేదా స్థానిక ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. కాంగ్రెస్‌ను పూర్తిగా పక్కనబెట్టారు. బిజెపి సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం ఓబీసీలను తమ వైపు తిప్పుకోవడం. మిగిలిన ఓబీసీ ఓటు బ్యాంక్ ప్రాంతీయ పార్టీల చేతుల్లో ఉంది. ప్రాంతీయ పార్టీలు, కొత్తగా ఆవిర్భవించిన సొంత వర్గ నేతల ముస్లింలు వైపు వెళ్తున్నారు. దళిత, క్రైస్తవ వర్గాల్లోని ఒక భాగం మాత్రమే ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిగిలి ఉన్న బలహీనమైన ఆసరా. అంతేకాదు, కులమతాలకు అతీతంగా ఉండే సమాజంలోని మధ్యతరగతి పౌరులు, విద్యార్థులు, ఉద్యోగులు బిజెపి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వారైనా సరే? కాంగ్రెస్‌కు ఓటేయడానికి వెనుకంజ వేస్తున్నారు. బిజెపిని వ్యతిరేకించడం సరే, కానీ ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు ఓటేసి మళ్లీ మనల్ని మనం ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చుకోవాలా? బలహీనమైన, దిశాలేని నాయకత్వానికి రాజ్యాధికారం ఇవ్వాలా? అని సగటు మధ్యతరగతి పౌరుడు ఆలోచిస్తున్నాడు. ఈ భయాన్ని, అనుమానాన్ని పోగొట్టడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ఢిల్లీలోని ఏసీ గదులు, జంతర్ మంతర్ ధర్నాలు, లాజిక్ లేని ఈసీ వ్యతిరేక పోరాటాల నుంచి బయటకు రావలసి ఉంది. శత్రువు విసిరిన ఎరను మింగి, మోదీ పన్నిన వ్యూహాల్లోనే తిరుగుతూ మా ఓట్లు పోయాయి, వ్యవస్థలు పోయాయి అని రోదించడం వల్ల ఏ రాజకీయ పార్టీకి భవిష్యత్తు ఉండదు. ప్రజాస్వామ్యంలో ప్రజల నిజమైన సమస్యలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, గ్రామీణ ప్రాంతాల సంక్షోభం వంటి అంశాలపై నిర్మాణాత్మకంగా పోరాడకుండా, కేవలం వ్యవస్థల వైఫల్యాన్ని వేలెత్తి చూపిస్తూ కాలక్షేపం చేస్తే కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కని రోజులు ముందే ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వం రెండో సారి ప్రభుత్వంలో అంత వ్యతిరేకత ఎలా పెరిగిందో.. దాన్ని బీజేపీ ఎలా క్యాష్ చేసుకుందో ఒక్క సారి స్టడీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి తాము చేస్తున్న తప్పులేమిటో.. నడవాల్సిన బాట ఏమిటో అర్థమవుతుంది. కానీ కాంగ్రెస్‌కు అలాంటి ఆలోచనలు లేవు. పాత పునాదులు కదిలిపోయాయి.. ఉన్న ఓటు బ్యాంకులు కరిగిపోయాయి.. ప్రత్యామ్నాయ ఓటర్లు ముఖం చాటేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకత్వం కళ్లు తెరచి, తమ వ్యూహాత్మక అంధత్వాన్ని వీడి, ప్రజాక్షేత్రంలో అసలైన రాజకీయం చేయకపోతే? సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ మహావృక్షం, మోదీ వేసిన రాజకీయంలో శాశ్వతంగా ఓటమి పాలైన ఓ సాధారణ ఆటగాడిగానే మిగిలిపోవడం ఖాయం!

# నిరంతర విద్యుత్తు ఏమైపాయె?



రాష్ట్రంలో విద్యుత్తు కోతలు రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. వ్యవసాయానికి సరిపడా కరెంటు అందడం లేదు. రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్తు అంతరాయాలు అదనపు భారంగా మారుతున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో పలు ప్రాంతాల్లో రైతులు నిరసనలకు దిగారు. ఈ పరిస్థితుల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా ఇప్పుడు ఏమైపోయిందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతున్నది. ప్రభుత్వం చెప్తున్న విద్యుత్తు సరఫరా లెక్కలకు, రైతులు అనుభవిస్తున్న వాస్తవ పరిస్థితులకు మధ్య తేడా ఎందుకు కనిపిస్తున్నది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వ పెద్దలు రాజకీయ ఆరోపణలతో ఎదురుదాడికి పాల్పడకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. రైతుల పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే వర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సరిపడా ఎరువులు దొరకక ఆందోళనలో చిక్కుకున్నారు. ఇటువంటి సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో విద్యుత్తు కోతలు మరో సంక్షోభాన్ని సృష్టించాయి. ఆ సంక్షోభంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాల్సి రావడం, మోటార్ల వద్ద వేచి ఉండటం, తక్కువ వోల్టేజీతో పంపుసెట్లు దెబ్బతినడం వంటి సమస్యలతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్తు అంతరాయాలతో పంటకు సరైన సమయంలో నీరు అందకపోతే దిగుబడి తగ్గుతుంది. పంట నష్టపోతే దాని ప్రభావం తర్వాతి సాగు పెట్టుబడులపైనా పడుతుంది. విద్యుత్తు కోతల సమస్య సాగుతోనే ఆగిపోదు. చిన్న పరిశ్రమలు, వర్క్‌షాపులు, దుకాణాలు, సేవారంగ సంస్థల పని కూడా విద్యుత్తుపై ఆధారపడుతుంది. కోతల వల్ల ఉత్పత్తి నిలిచిపోతుంది. పనివేళల నష్టం, జనరేటర్ల ఏర్పాటుతో ఖర్చులు పెరుగుతాయి. గృహ వినియోగదారులపై కూడా తీవ్రమైన ప్రభావం పడుతుంది. ప్రజలకు అవసరమైన మేరకు విద్యుత్తును అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చూడాలి. లోటు ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు చేయాలి. ఇందుకోసం ప్రణాళికతో పని చేయాలి. బొగ్గు సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలి. ఉత్పత్తి కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి. ప్రసార, పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేయడం కూడా అంతే ముఖ్యం. విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్న కొద్దీ ముందస్తు ప్రణాళిక అవసరం పెరుగుతుంది. రాష్ట్రంలో 202425 ఆర్థిక సంవత్సరంలో నమోదైన విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లు కాగా, 202526లో అది 18,548 మెగావాట్లకు చేరింది. అంటే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, కొనుగోళ్లు, సరఫరా వ్యవస్థలను నిరంతరం బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. ఏ ప్రాంతంలో ఎంత విద్యుత్తు సరఫరా చేస్తున్నారు? ఎంతసేపు అంతరాయాలు ఏర్పడుతున్నాయి? అందుకు కారణం ఏంటో చెప్పాలి. ఉత్పత్తి తగ్గిందా? స్థానిక లైన్లు/ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? ప్రజలకు వెల్లడించాలి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్తును సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం అదే స్థాయి సేవను కొనసాగించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నది? అంటే సమాధానం లేదు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు, ఉత్పత్తి కేంద్రాల పనితీరు, బొగ్గు నిల్వలు, సరఫరా వ్యవస్థలోని బలహీనతలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. గత ప్రభుత్వంపై అక్కసుతో అనవసర నిందలు వేయడం సమస్యకు పరిష్కారం కాదు. ఈ విషయం కాంగ్రెస్ పాలకులు గుర్తుంచుకోవాలి. విద్యుత్తు సమస్యను అధిగమించడానికి ప్రభుత్వం తక్షణ, దీర్ఘకాలిక చర్యలను సమాంతరంగా చేపట్టాలి. ముందుగా వ్యవసాయానికి నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా షెడ్యూల్‌ను గ్రామాల వారీగా ప్రకటించాలి. అనివార్యమైన అంతరాయాలు ఏర్పడితే రైతులకు ముందుగానే సమాచారం అందించాలి. సబ్ స్టేషన్లలో సరఫరా సమయాలను నమోదు చేసి, వాటిని ప్రజలకు అందుబాటులో పెట్టాలి. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తక్కువ వోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పరిశీలించాలి. ఓవర్‌లోడింగ్ ఉన్న ప్రాంతాల్లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలి. మరమ్మతులు, నిర్వహణను ముందస్తు స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాలి. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యం, బొగ్గు సరఫరా, విద్యుత్తు కొనుగోళ్లను సమీక్షిస్తూ నెల ముందుగానే అంచనా వేయాలి. సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడంతోపాటు, అవసరమైన చోట నిల్వ సాంకేతికతను అభివృద్ధి చేయడం కూడా దీర్ఘకాలిక పరిష్కారంలో భాగం కావాలి. విద్యుత్తు సంస్థల ఆర్థిక పరిస్థితిని నిర్లక్ష్యం చేయకూడదు. సరఫరా వ్యయం, ఒప్పందాలు, బకాయిలు, రాయితీల చెల్లింపులపై పారదర్శకత అవసరం. విద్యుత్తు నాణ్యత, సరఫరా తగ్గకూడదు. ఉచిత విద్యుత్తు పథకాలు కొనసాగించాలి. అవసరమైన నిధులు, విద్యుత్తు లభ్యతపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి. అనుభవ రాహిత్యంతో వ్యవహరిస్తున్న సీఎం భేషజాలకు పోకుండా ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా కృషి చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి. ఆ ప్రగతి కొనసాగాలంటే విద్యుత్తు సరఫరాలో స్థిరత్వం ఉండాలి. ప్రభుత్వం ముందున్న పని ఒక్కటే. విద్యుత్తు సరఫరాపై ప్రకటనలు ఎన్ని చేశారనేది కాదు, ప్రజలకు నాణ్యమైన కరెంటును ఎంత నిరంతరంగా అందించారనేది ముఖ్యం. మాటల కు, చేతలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తేనే విద్యుత్తు కోతల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేవని ప్రభుత్వం బుకాయిస్తున్నది. మరి సబ్‌స్టేషన్ల వద్ద రైతులు ఎందుకు నిరసనలు తెలుపుతున్నారో మంత్రులు వివరించాలి. సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలి. ఎక్కడైనా సరఫరా లోపం ఉంటే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ సాధించిన అభివృద్ధిలో వ్యవసాయం, సాగునీరు, విద్యుత్తు కీలక పాత్ర పోషించాయి.

# యూత్ పెట్టే పరీక్షలో మోదీ పాసవుతారా?

హార్దిక్ పటేల్ ఎవరికైనా గుర్తున్నాడా? ఒక దశాబ్దం క్రితం వార్తా పత్రికల ఫ్రంట్ పేజీలలోను, టెలివిజన్ ప్రైమ్--టైమ్ ప్రసారాలలోనూ అతడికి చాలా ప్రాధాన్యం లభించింది. 2015లో గుజరాత్‌లో పాటీదార్ సామాజికుల ఆందోళనకు పటేల్ నాయకత్వం వహించినప్పుడు అతడి వయసు 22 సంవత్సరాలే. హార్దిక్ ర్యాలీలు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. దానికి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. అవి చివరకు 2016లో ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ నిష్క్రమణకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని సవాల్ చేసిన ఆ యువకుడు ఇప్పుడు మరో బీజేపీ ఎమ్మెల్యే! తిరుగుబాటు నుంచి పాలకపక్షం శ్రేణుల్లోకి హార్దిక్ ప్రస్థానం 'గుజరాత్ మోడల్ ఆఫ్ మేనేజింగ్ డిసెంట్' (భిన్నాభిప్రాయాలు, నిరసనలను అణచివేయడంలో గుజరాత్ విధానం)ను విశదం చేస్తుంది. ఒక ఉద్యమాన్ని రాజ్యాధికారంతో అణచివేసేందుకు మీరు ప్రయత్నించవచ్చు లేదా ఆ ఉద్యమ ప్రధాన నాయకులను అధికార రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా చేసుకోవచ్చు. నిరసనకారుడు ఒక భాగస్వామిగా మారవచ్చు, ఆందోళనకారుడు అస్మదీయుడు కాగలడు. అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఇప్పుడు ఎదుర్కోవలసిన ప్రశ్న-- బలవంతపెట్టడం లేదా కలుపుకుపోవడం, లేక ఆ రెండు పద్ధతుల కలగలుపుతో గుజరాత్‌ను పాలించిన రీతిలో విశాల భారత్‌ను పరిపాలించడం సాధ్యమేనా? ఢిల్లీలో ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకారులపై దమనకాండ ఆ సవాల్‌కు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనలను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తుగా సీజేపీ నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజలు నిరసన ప్రదేశానికి చేరకుండా అవరోధాలు కల్పించారు. వందలాది యువజనులను అదుపులోకి తీసుకుని తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లకు తరలించారు. ఈ పరిణామాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు కూడా పోలీసు ప్రతాపాలకు గురయ్యారు. సాధారణంగా ద్వైధీభావంతో వ్యవహరించే సుప్రీంకోర్టు సైతం నిరసన తెలిపే స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని మరోసారి నొక్కి చెప్పిందంటే పోలీసులు వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికంగా ఉన్నదో అర్థమవుతుంది. ప్రతిపక్షాల మరో అరాచక ఆందోళనను తాము ఎదుర్కొంటున్నట్టు మోదీ సర్కార్ విశ్వసించి ఉండవచ్చు. విపక్షాల నిరసనను పోలీసులతో అదుపుచేయవచ్చని, రాజకీయ దురుద్దేశాలతో ఆ నిరసనకు పూనుకున్నాయని కొట్టివేయవచ్చని కూడా పాలకులు భావించి ఉండవచ్చు. నిరసనల నిర్వాహకులను అరెస్ట్ చేయడం ద్వారా వాటి ప్రభావాన్ని నివారించవచ్చని వారు అనుకుని ఉండవచ్చు. అయితే ఆ అంచనా పూర్తిగా ప్రమాదకరమైన తప్పుడు ఆలోచనే. ఢిల్లీ పరిణామాలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి. ఇది సీఏఏ (పౌరసత్వ చట్ట సవరణ) వ్యతిరేక ఆందోళన కాదు. ఆ సందర్భంలో నిరసనకారులను జాతి వ్యతిరేకులు అని అధికార వర్గాలు నిత్యం నిందించాయి. వారిలో ఒకరైన ఉమర్ ఖలీద్ 2020 నుంచి జైలులో ఉన్నాడు. ఇది మూడు కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమం కూడా కాదు. ఉద్యమించిన రైతులను ప్రభుత్వం తొలుత ప్రతిఘటించింది. వారిలో కొందరు ఖలిస్థానీలు అని కూడా ఆరోపించింది. అంతిమంగా నవంబర్ 2021లో ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం మోదీ సర్కార్‌కు అనివార్యమయింది. ఈ ఉదంతాలు అన్నీ ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేశాయి. ప్రస్తుత ఉద్యమం విసురుతున్న సవాల్ స్వభావాన్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నదా లేదా అన్నది ఈ నాటి ఒక ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే ఇది కాంగ్రెస్, రాహుల్‌గాంధీ లేదా కొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలతో వ్యవహరించడమంత తేలికైన విషయం కాదు, బీజేపీకి ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఉన్నది. గత పదేళ్లుగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలలో అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడు సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఉన్నా, లేకపోయినా తమ ప్రత్యర్థులతో సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన సమస్త వనరులు తమకు ఉన్నాయనే ధీమా బీజేపీ నాయకులకు ఉన్నది. అయితే ప్రస్తుత సవాల్ ఒక సంప్రదాయ రాజకీయ పక్షం నుంచి వచ్చింది కాదు. రాజకీయ నాయకుల తీరుతెన్నుల పట్ల ఏ మాత్రం సహనం లేని యువ భారతీయులు విసిరిన సవాల్ అది. సంప్రదాయ రాజకీయ ప్రత్యామ్నాయాలను కూడా వారు విశ్వసించరు. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాలకులతో ఘర్షణపడినప్పుడు వారు కోల్పోయేది కూడా ఏమీ లేదు. మరి ఇటువంటి యువ భారతీయుల నుంచి సవాల్ ఎదురయినప్పుడు పాలకులు ఎలా ప్రతిస్పందించాలి? వారి ఆగ్రహం పాలకులకు పూర్తిగా ఒక భిన్నమైన రాజకీయ సవాల్‌ను విసిరింది, సందేహం లేదు. ప్రతిస్పందన కూడా భిన్నమైన రీతిలో ఉండితీరాలి. అయితే తాము ఎదుర్కొంటున్న శక్తిని మోదీ ప్రభుత్వం తక్కువగా అంచనా వేసిందని భావించేందుకు ఆస్కారమున్నది. గత మేలో సీజేపీ తొలుత ప్రజాజీవితంలో ప్రత్యక్షమయినప్పుడు ప్రభుత్వమూ, దాని మద్దతుదారులు దానిని కొట్టివేశారు, తేలికగా తీసుకున్నారు. గౌరవప్రదంగా లేని పేరు, మీమ్స్ ఆధారిత రాజకీయాలు దానిని దూషణ భూషణలకు గురిచేశాయి. సీజేపీతో వచ్చే ముప్పు ఏమీ లేదని భావించినందునే జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనకు దానిని అనుమతించారు. అయితే నీట్ ప్రశ్నపత్రాల లీక్ విషయంలోను, తమ భవిష్యత్తు విషయంలోనూ యువ భారతీయుల వ్యాకులత, ఆగ్రహావేశాలు అంత తేలిగ్గా సమసిపోయేవి కావు. సీజేపీ ఉద్యమం విద్యార్థులు, యువజనులకే పరిమితం కాకుండా విశాల ప్రజాశ్రేణుల మద్దతును పొందింది. నీట్ ప్రశ్నపత్రాల వివాదంపై ప్రభుత్వ ప్రతిస్పందన రాజకీయ పర్యవసానాలకు దారితీసింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనివార్యమయింది. ప్రస్తుత ఉద్యమం ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతోంది. ప్రతిపక్షాలు ఉద్యమించీ ఉద్యమించీ అలసిపోయి మిన్నకుండి పోతాయని ప్రభుత్వం భావిస్తుందేమో. కానీ నిరసనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన దృశ్యాలు ప్రజల మనః ఫలకాల నుంచి అంత త్వరగా చెరిగిపోతాయా? యువ నిరసనకారులపై హిందూ రక్షాదళ్ అనే హిందుత్వ బృందం దాడుల విషయమేమిటి? అటువంటి సంఘటనలపై విచారణ తప్పనిసరి. వాటికి జవాబుదారీతనం లేకపోతే ఎలా? మౌనం వహించడం సరికాదు. యువజనులపై పోలీసుదాడుల దృశ్యాలు డిజిటల్ విశ్వంలో వెన్వెంటనే వ్యాపించాయి. ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే టీవీ చానెళ్లు సైతం ఆ ఉదంతాలకు సంబంధించిన వార్తల ప్రసారాన్ని ఉపేక్షించలేకపోయాయి. ఇక్కడ తరాల అంతరం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడం నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్న మంత్రులు, రాజకీయవేత్తలు ఉన్న ప్రపంచం... రాజకీయ సమాచారాన్ని స్వతస్సిద్ధంగా సృష్టించి, పంచుకుంటూ, స్పందిస్తున్న యువజనులు ఉన్న ప్రపంచం ఒకటి కావు. అవి పూర్తిగా భిన్నమైనవి. ఒక మంత్రి పక్కా ప్రణాళికతో అత్యంత జాగ్రత్తగా రూపొందించిన సందేశం ప్రజలలోకి విస్తృతంగా వెళ్లవచ్చు. అయితే వారు దానికి ఎలా స్పందించాలో అది నిర్దేశించలేదు. డిజిటల్ ప్రజారంగం ఒక టెలివిజన్ స్టూడియోకు భిన్నమైనది. టీవీ స్టూడియోలో అయితే ఎవరు, ఎప్పుడు మాట్లాడాలో ప్రభుత్వం నిర్ణయించగలదు. డిజిటల్ విశ్వం విషయంలో అటువంటిది కుదరదు. ఈ కారణంగానే ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవల్సిన అవసరమున్నది. ప్రజాస్వామిక జవాబుదారీతనం అనేది ఉద్యోగాలు, ధరల పెరుగుదల, పరీక్షల నిర్వహణ, తమ భావి అవకాశాలపై వ్యాకులతల నుంచి వేరుగా ఉండే అంశం కాదని యువ భారతీయులు భావిస్తున్నారు. ఈ దృష్ట్యా ప్రస్తుత ఆందోళనల పట్ల మోదీ ప్రభుత్వం భిన్న దృక్పథంతో వ్యవహరించవలసిన అవసరమున్నది. భారత్ అంటే కేవలం గుజరాత్ మాత్రమే కాదు కదా. గుజరాత్ నమూనా పూర్తిగా ఒక అత్యంత కేంద్రీకృత రాజకీయ నాయకత్వం ప్రాతిపదికన రూపొందింది.

# అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 17, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):

నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ప్రభుత్వాల ఉదాసీనత మూలంగా పనులు పూర్తవటానికి మరొక రెండు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు దీకొండ యాదగిరి అన్నారు. నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రతినిధి బృందం అర్సపల్లి అభివృద్ధి కమిటీ సంయుక్తంగా అరసపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దీకొండ యాదగిరి మాట్లాడుతూ 137 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం 20 23లో ప్రారంభించారని, అది 2025 సెప్టెంబర్ కు పూర్తి కావాలని, ప్రస్తుతం పనులు మాత్రం నామమాత్రం



జరుగుతున్నాయని ఆయన అన్నారు. అర్సపల్లి అభివృద్ధి కమిటి ప్రతినిధులు చాగంటి గంగాధర్, సిర్ప గంగాధర్, నాగయ్య తదితరులు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు తాము తమ భూములను కారు చౌకగా ఇచ్చామని, కానీ గత మూడు సంవత్సరాలుగా తమకు మాత్రం దుమ్ము, ధూళి తో గ్రామంలోని అనేకమంది అనారోగ్యానికి గురయ్యారని, ఏడుగురు యాక్సిడెంట్ల మూలంగా చనిపోయారని, కొంతమంది అంగవైకల్యం పొందారని వారన్నారు. ప్రతిరోజు గంటల తరబడి రైల్వే గేటు మూసి వేయటం మూలంగా వందలాది వాహనాలు గ్రామంలో నిలబడి పోతున్నాయని , దీని మూలంగాసామాన్య జీవనం కూడా కొనసాగించలేకపోతున్నామని వారు వాపోయారు. నగర అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కే రామ్మోహన్ రావు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం విడనాడాలని, సర్వీసు రోడ్లను నిర్మించాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవీంద్ర నాథ్ సూరి రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు సిర్ప హనుమాన్లు, ఈవిల్ నారాయణ, ప్రసాద్ రావు, నగర అభివృద్ధి కమిటీ నాయకులు హుస్సేన్, మధుసూదన్, రాధా కిషన్, లింగయ్య, భూమన్న, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

# నవజీవన్ నగర్‌లో ఘనంగా ఉచిత మెడికల్ క్యాంపు - ఆరోగ్యమే నిజమైన వరం: బండి రమేష్

కూకట్పల్లి అక్టోబర్ 17 మన మీ వార్త :

బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్‌లో పాస్టర్ క్రిస్టఫర్ మరియు సులోచన ఆధ్వర్యంలో "హెల్త్ ఈజ్ ఏ బ్లెస్సింగ్" అనే నినాదంతో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజన్నతో పాటు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి బిజీ జీవితంలో అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు వైద్య పరీక్షలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మెడికల్ క్యాంపులను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు





అందించడం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ మెడికల్ క్యాంపు నిర్వహించిన పాస్టర్ క్రిస్టఫర్, సులోచనను బండి రమేష్ అభినందించారు.

ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, లక్ష్మయ్య, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్ పటేల్, మధు మోహన్, జిల్లా శివ, జావిద్, రేణుక, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు

# ఉప్పల్ నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 17 ( మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాలు, మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు.

ఏఎస్ రావు నగర్ డివిజన్‌లోని సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయం, కాప్రా కందిగూడ డివిజన్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం, భవానీ నగర్ సంక్షేమ సంఘం సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం, కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడలోని సింహవాహన యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం, వాంపుగూడ డివిజన్‌లోని గోపాల్ రెడ్డి నగర్ సంక్షేమ సంఘం, సాయిబాబా నగర్‌లోని పోచమ్మ తల్లి యువజన సంఘం, ఆదిశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పద్మశాలి టౌన్‌షిప్‌లోనూ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నాచారం శ్రీ మహంకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా





సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రతిరోజూ ఒక్కో రూపంలో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించడం మన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో దసరా పండుగను ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకుంటారని తెలిపారు.

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, పావని రెడ్డి, సీతారాం రెడ్డి, అంజిరెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విట్టల్ నాయక్, డివిజన్ అధ్యక్షులు టీలు యాదవ్, శ్రీహరి, ప్రకాశ్ రెడ్డి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు అజీజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద శ్రీనివాస్, పెద్ద నాగరాజు, కొబ్బరి నాగశేషు, కొబ్బరి నాగరాజు, మురళి, భూపాల్ రెడ్డి, సుంకు శ్రీకాంత్ రెడ్డి, రఘు, సుజిత్ రెడ్డి, సింగిరెడ్డి వికాస్ రెడ్డి, రాకేష్ యాదవ్, పూర్ణ యాదవ్, బట్టల శ్రీను, జగదీష్, శివన్న తదితరులు, ఆలయ కమిటీల సభ్యులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం నిర్వహించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

- సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలి: ప్రత్యేక పూజలు

చిలుకానగర్, అక్టోబర్ 17 ( మన మీ వార్త):

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చిలుకానగర్ శివాలయంలో వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, వరుణ దేవుడి ఆశీస్సులతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు.రైతులకు సాగునీరు సమృద్ధిగా అందాలని, పంటలు బాగా పండి రైతుల





కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నారు.ప్రకృతి అనుకూలించి చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాలని, వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వరుణ యాగం సందర్భంగా ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి 20,000 ఆర్థిక సహాయం అందజేత



టేకుమట్ల అక్టోబర్ 17 (మన మీ వార్త )

టేకుమట్ల మండలం వెలిశాల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో 2003-04 బ్యాచ్ మిత్రుడు అచ్చే సతీష్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు విషాద వార్త తెలుసుకున్న తోటి మిత్రులు సతీష్ కుటుంబానికి ధైర్యం చెబుతూ బాధలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించి 20,000 ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు 22 సంవత్సరాల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న మిత్రులు నేడు కష్టకాలంలో ఒకరి కోసం ఒకరు నిలబడటం వారి కుటుంబ సభ్యులను భావోద్వేగానికి గురి చేసింది స్నేహమంటే జ్ఞాపకాలు కాదు అవసరమైన సమయంలో అండగా నిలబడడమే అని ఈ సంఘటన నిరూపించింది స్నేహితులు ఉంటే దుఃఖం సగమే అండగా నిలిచే మనుషులు ఉంటే జీవితం ధైర్యంగా ముందుకు సాగుతుందని నిరూపించారు సతీష్ కుటుంబ సభ్యులు తమ బాధను పంచుకుంటూ ఆర్థిక సహాయం అందించిన మిత్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు ఆకునూరి సతీష్ కన్నూరి రమేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి 4వ ఫేస్ కాలనీ పట్ల ప్రభుత్వ చిన్నచూపు ఎందుకు?

- జనసేన నాయకులు కొల్లా శంకర్..



కూకట్పల్లి అక్టోబర్ 17 మన మీ వార్త :

కూకట్‌పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి కాలనీ 4వ ఫేస్ వాసులు తీవ్రమైన నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఇక్కడి స్థానికుల పట్ల ప్రభుత్వం, అధికారుల వైఖరి ఎందుకు ఇంత చిన్నచూపుగా ఉందంటూ జనసేన నాయకులు కొల్లా శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్వీర్యంగా మారిన పార్కులు మొక్కలు పెరిగి, చెత్తాచెదారంతో పార్కులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి, భయాందోళన కలిగిస్తున్న పాముల బెడద, కాలనీలో సరైన పారిశుద్ధ్యం లేకపోవడం, పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. రాత్రి సమయాల్లోనే కాకుండా పగటిపూట కూడా పాములు సంచరిస్తుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

తాగుబోతులకు అడ్డాగా మారిన 4 ఫేస్ పార్కులు రాత్రి వేళల్లో యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు గంజాయి, మద్యం విచ్చలవిడిగా సేవిస్తూ స్థానికులను, మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకునే వారే లేరు.రాత్రివేళల్లో పోలీసు గస్తీ (పెట్రోలింగ్ ) పెంచాలని తెలియజేసారు తక్షణమే 4వ ఫేస్ కాలనీ వాసుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల నరేంద్ర (అడ్వాకెట్ ) వీరామహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కాపురానికి రావట్లేదని భార్యపై దాడి..

(మన మీ వార్త న్యూస్) అక్టోబర్ 17,(నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



కాపురానికి రావట్లేదని భార్య దాడి చేశాడు. అంతేకాదు మామపై కూడా దాడికి తెగబడ్డాడు. ఈ ఘటన నగరంలోని (నిజామాబాద్) వినాయక్ నగర్ లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.

**వినాయక్ నగర్ లో..**

నాల్గో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మధుకర్ కు నగరంలోని వినాయక్ నగర్ కు చెందిన మహిళతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె తిరిగి వినాయక్ నగర్ లోని తన పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆమె ఇంటికి వచ్చిన భర్త మధుకర్ కాపురానికి రావాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన మధుకర్ కత్తితో భార్య, మామపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని జీజీహెచ్ కు తరలించారు. సమాచారం అందుకున్న నాల్గో టౌన్ ఎస్ హెచ్ వో సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రస్తుతం మామ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 17

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి

:



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా లోని మహిళలందరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మహిళలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఈ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు.

## హనుమకొండ ఎస్ఐఆర్
## పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల్లో అసలు ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**





జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న విచారణలను పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని తెలిపారు.
ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను నిర్ధారించే సమయంలో సంబంధిత పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు.
ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హుల నమోదు, ద్వంద్వ నమోదులు లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని దరఖాస్తులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి, భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచాలని సూచించారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తుదారుల అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేసి అర్హతలను నిర్ధారించాలని సూచించారు. నకిలీ, తప్పుడు, ద్వంద్వ దరఖాస్తులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.
వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లాలో పట్టభద్రుల నుంండి ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోందని, అందిన మొత్తం 19 వేల దరఖాస్తుల్లో 45 దరఖాస్తులు పూర్తిగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. సుమారు 780 దరఖాస్తులు ఏఈఆర్వో స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలిన అన్ని దరఖాస్తులను బూత్ స్థాయి అధికారులకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తో పాటు ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, డీసీవో మోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ కలిసి
## శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



వరంగల్ జిల్లా జడ్జి శ్రీమతి బి.వి. నిర్మలా గీతంబ గారిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబును
## మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ సత్య శారద

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



వరంగల్ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు.

## ప్రకృతి పండుగ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిది :**



**జిడబ్ల్యూఎంసీ: అక్టోబర్ 17 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను నగర మహిళలందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు.
ప్రకృతిని పూలతో పూజిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సౌభాగ్యాలు నింపాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలకు కొనసాగాలని ఆయన ఆకాంక్షిస్తూ మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

# బీరప్పగడ్డ డివిజన్‌లో రూ.56 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం.. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం: మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్

**బీరప్పగడ్డ, అక్టోబర్ 17 ( మన మీ వార్త):**





ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్‌లో సుమారు రూ.56 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. శంకరయ్య కిరాణా షాపు నుంచి శ్రీనగర్ కాలనీలోని అక్రమ్ ఇంటి వరకు నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, కాంట్రాక్టర్ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని అన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో బస్తీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
కాలనీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ, వాటిని నాణ్యతతో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల్ల కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, కాలేరు నర్సింగ్ రావు, బాలకృష్ణ గౌడ్, బంటి గౌడ్, బాలాజీ, అక్రమ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్ర నగర్ జాంబవంత్ యూత్ అసోసియేషన్ అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆవులగడ్డ శ్రీనివాస్ యాదవ్







**రామంతాపూర్, అక్టోబర్ 17 ( మన మీ వార్త):**

రామంతాపూర్ రాజేంద్ర నగర్ కాలనీలో జాంబవంత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆవులగడ్డ శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, లోకకల్యాణం కోసం ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. రాజేంద్ర నగర్ కాలనీలో జాంబవంత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు భక్తుల సందడితో కొనసాగుతున్నాయి. ఉత్సవాల నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొంటూ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాంబవంత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సాయి, ప్రధాన కార్యదర్శి రవి మస్కా, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఏడవ రోజు

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**





ఉదయం గం॥ 04-00లకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించడానికి అంగీకార ప్రార్ధన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారిని సరస్వతీమాత గా అలంకరించి పూజానాధలు నిర్వహించారు. ఈ రోజు అమ్మవారు సాధకుడి బుద్ధిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనం వల్ల సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు సరస్వతీ అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించడానికి ఉదయం నుండి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఈరోజు అమ్మవారికి రథసేవ జరిపారు శరీరాన్ని రథంతో పోలుస్తారు రక్తసేవలో సేమింపబడుతున్న అమ్మవారి రథం లాగితే ఈ జీవనరతం అనేది బాగా సాగుతుందని నమ్మకం అందుకు అనేకమంది భక్తులు పోటీపడుతూ ఈ రథాన్ని లాగారు నవరాత్ర కల్పాన్ని అనుసరించి కాలరాత్రి మరియు రక్తబీజహా దుర్గా క్రమంలో అమ్మవారికి పూజారాధనలు జరిపారు భద్రకాళీ శరణం మమ అనే నామస్మరణతో దేవాలయం మారుమ్రోగింది. రేపు భద్రకాళి అమ్మవారి జన్మోత్సవం, దుర్గ భద్రకాళిగా కోటి యోగినీ గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని అనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం.
ఈ రోజు కార్యక్రమాలకు ఉభయదాతలుగా శారదా విద్యా సంస్థలు హైదరాబాదు వారి అధినేతలు సందిపూడి రవిశంకర్ మానస దంపతులు. నాగభూషణం- శ్రీదేవి దంపతులు, డా॥ బి. వెంకటేశ్వర్లు సునీత దంపతులు, డా॥ బి. సనత్ కుమార్. డా॥ సాహితి దంపతులు, కుమారి డా॥ బి. వైష్ణవి. శ్రీ జోశ్యుల కామేశ్వరశర్మ - కిరణ్మయి దంపతులు వ్యవహరించారు.
ఈ రోజు అమ్మవారిని తెలంగాణా రాష్ట్ర ఐ.టి శాఖామాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సందర్శించారు. మంత్రివెంట వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు మరియు డి.సి.సి అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు. ఆలయానికి విచ్చేసి ప్రముఖులకు ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవరాత్ర విశేష పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు ఎం.ఎల్.ఏ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు వారి బంధుమిత్రలు దేవాలయములో నూతనముగా కోటిరూపాయల వ్యయముతో తయారు చేయించినటువంటి 27 ఫీట్ల ఎత్తుగల రథమును మంత్రి ఆధ్వర్యంలో దేవాలయమునకు స్వాధీనపరచుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డా॥ శివసుబ్రహ్మణ్యం. ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, కల్లూరి పవన్ కుమార్, కటకం రాములు, కారెంగుల సురేష్ బాబు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి. చిదర అంజనీదేవి, మాడిశెట్టి సతీష్, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, మోతుకూరి మయూరి రామేశ్వర్రావులు మాజీ ధర్మకర్తలు శ్రీ జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్, శ్రీమతి గాండ్ల స్రవంతి. పాలడుగుల అంజనేయులు తదితరులున్నారు.
అట్లాగే ఈ రోజు అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో మాజీ ఎం.ఎల్.సి జోగినపల్లి సంతోష్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎం.ఎల్.ఏ దాన్యం వినయభాస్కర్, నాగుర్ల వెంకటేశ్వర్లు, కె. వాసుదేవ రెడ్డి తదితరులున్నారు.
రామల సునీత కార్యనిర్వహణాధికారి

## మహబూబాబాద్ జిల్లా.సద్దుల బతుకమ్మ, విజయదశమి (దసరా) పండగ శుభాకాంక్షలు

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను జిల్లా లోని మహిళలందరూ ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు, ఆదివారం సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 20 విజయదశమి, పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మహిళలు ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ప్రపంచంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, చెడుపై మంచి విజయానికి నిదర్శనంగా జరుపుకునే విజయదశమి (దసరా) ప్రజలందరూ ఆనందోత్సాహాలు, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం మనదని పేర్కొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## ఎస్సీ, ఎస్టీ కేసులో తప్పిదాలపై జర్నలిస్టుల ఫిర్యాదు

**- సమగ్ర విచారణ జరిపించాలని పోలీస్ కమిషనర్‌కు వినతి**



**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

**హన్మకొండ :** ఎస్సీ, ఎస్టీ కేసు (ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025) విచారణలో జరిగిన తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతకు జర్నలిస్టులు శనివారం ఫిర్యాదుచేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నంబర్ 471/2025 కింద నమోదైన కేసులో తాము సాక్షులుగా ఉన్నామని జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, తోట సుధాకర్, పెండెం వేణుమాధవ్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. విచారణ అధికారిగా ఉన్న హనుమకొండ ఏసీపీ నరసింహారావుతో పాటు ఏ ఒక్క పోలీసు అధికారి కూడా తమను విచారణకు పిలవలేదని పేర్కొన్నారు. తమ నుంచి ఎలాంటి వాంగ్మూలాలు తీసుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ, 2025 ఆగస్టు 15న ఏసీపీ సమక్షంలో తాము వాంగ్మూలాలు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించి వాటిని న్యాయస్థానానికి సమర్పించి కేసును మూసివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇదే విషయంపై విచారణాధికారిగా ఉన్న సంబంధిత ఏసీపీని సంప్రదించడంతో కేసు మూసివేశామని తెలపడంతో ఖంగు తిన్నామని తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా కేసును ఎలా మూసివేస్తారని ప్రశ్నించడంతో ఏమైనా ఉంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని సమాధానమిచ్చారని పేర్కొన్నారు. తమను విచారించకుండానే తమ పేర్లతో వాంగ్మూలాలు ఎలా నమోదు చేశారు? వాటిని ఏ ఆధారాలతో న్యాయస్థానానికి సమర్పించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంబంధిత పోలీసు రికార్డులు, వాంగ్మూలాలు, న్యాయస్థానానికి సమర్పించిన పత్రాలను పరిశీలించి, విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కోర్టు ద్వారా తీసుకున్న పత్రాలన్నింటినీ సిపీకి అందించారు. ఫిర్యాదును, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ శ్వేత సానుకూలంగా స్పందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి విచారణ జరిపిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన కేసులో బాధితుడు కంకనాల సంతోష్ మరో ఫిర్యాదులో తనకు జరిగిన అన్యాయంపై సీపీకి వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో జర్నలిస్ట్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, టీయూడబ్ల్యూజె హన్మకొండ జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి పొడిచెట్టి విష్ణువర్ధన్ , గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, టియుడబ్ల్యూజే రాష్ట్ర బాధ్యులు పి .వేణుమాధవ్, తోట సుధాకర్, బోళ్ల అమర్, మేరుగుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నగర పారిశుద్ధ్యంపై కమిషనర్ వెంకన్న ఆకస్మిక తనిఖీలు

**- పరిశుభ్రతలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి**

**- రోడ్ల ఆక్రమణలు, బిల్‌బోర్డులపై కఠిన చర్యలు**





**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 17:** నగర పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు.

శనివారం ఉదయం నగరంలోని కాళోజీ కళాక్షేత్రం నుంచి ఆదాలా జంక్షన్ వరకు, అలాగే పలు ప్రాంతాల్లో ఆయన ఆకస్మికంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్లు, రహదారుల పక్కన ఉన్న ప్రాంతాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని స్పష్టం చేశారు. సెంట్రల్ మీడియన్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

పారిశుద్ధ్య సిబ్బంది కేటాయించిన ప్రాంతాల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని, రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. నగర పరిశుభ్రతను నిరంతర ప్రక్రియగా పరిగణిస్తూ, అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

నగరంలోని ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, ఇతర ప్రకటనల బోర్డులను నిబంధనల ప్రకారం తొలగించాలని కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రహదారులపై ఆక్రమణల వల్ల ప్రజలకు, ట్రాఫిక్ కు,వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. తొలగించిన ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

నగరంలో పరిశుభ్రతను మెరుగుపరచడంతోపాటు రహదారులను ఆక్రమణల నుంచి విముక్తం చేసి, నగర సుందరీకరణకు ప్రాధాన్యతనివ్వాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ పర్యటనలో సీఎంహెచ్ఓ డాక్టర్ వాజారెడ్డి, సిటీ ప్లానర్ శ్రీ రవీంద్ర రాడేకర్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకల పంపిణీ











**ఉప్పల్, అక్టోబర్ 17 ( మన మీ వార్త):**

బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా బట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలను పంపిణీ చేసి కేక్ కట్ చేసి సతీష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రేగళ్ల సతీష్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అలాగే మొక్కలు నాటడం జరిగిందిరక్తదాన శిబిరం నీ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారుసమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ, వారి పట్ల ఆప్యాయతను చాటుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, బొంతు శ్రీదేవి యాదవ్, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, ప్రభుదాస్, పొన్నాల దేవేందర్ రెడ్డి, పలువురు స్థానిక బిఆర్ఎస్ కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా.తంగేడు పూల సాక్షిగా.. తరతరాల సంస్కృతి

**- ప్రకృతి ఆరాధనకు, మహిళల ఆత్మీయతకు ప్రతీక బతుకమ్మ**

**- జిల్లా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు**

**- జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**




తంగేడు పూల పసిడి కాంతులు.. గునుగు పూల రంగుల సోయగాలు.. తీరొక్క పూలను పొందికగా పేర్చే చేతులు.. బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా కదిలే అడుగులు.. పల్లె జీవనాన్ని పలకరించే పాటలు.. ఇవన్నీ కలగలిసిన పూల సంబరం బతుకమ్మ. ప్రకృతిని ప్రేమిస్తూ, పూలలో దైవాన్ని దర్శిస్తూ, బంధాలను పెనవేసుకునే ఈ పండుగ తెలంగాణ జీవన సౌందర్యానికి అద్దం పడుతుందని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు.
పూలనే దైవస్వరూపంగా పేర్చి ఆరాధించే విశిష్ట సంప్రదాయం బతుకమ్మ సొంతమని కలెక్టర్ తెలిపారు. అనేక సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలకు నిలయమైన తెలంగాణలో ఈ పూల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నేలతో, నీటితో, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక గుర్తింపుగా నిలుస్తోందని వివరించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలను రంగుల వరుసలుగా పేర్చడంలో మహిళల కళాత్మకత ఉట్టిపడుతుందన్నారు. ఒక్కో పువ్వును జాగ్రత్తగా అమర్చుతూ బతుకమ్మకు అందమైన రూపమిచ్చే తీరు వారి ఓర్పుకు, అభిరుచికి, సృజనాత్మకతకు నిదర్శనమని పేర్కొన్నారు. పూల సేకరణ నుంచి బతుకమ్మను సిద్ధం చేసే వరకు ఇంటిల్లిపాదీ కలిసి పాల్గొనడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుందన్నారు.
బతుకమ్మ పాటల్లో తెలంగాణ పలుకుబడి, పల్లె జీవితం, కుటుంబ అనుబంధాలు, తరతరాల అనుభవాలు వినిపిస్తాయని కలెక్టర్ తెలిపారు. మహిళలంతా వలయంగా చేరి, చప్పట్లు చరుస్తూ, గొంతు కలిపి పాడే పాటలు మన మౌఖిక సాహిత్య సంపదకు నిదర్శనమన్నారు. అమ్మమ్మలు, నానమ్మలు పాడిన పాటలను చిన్నారులకు నేర్పించడం ద్వారా భాషా సొగసును, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు.
పుట్టింటికి చేరిన ఆడబిడ్డలతో ఇళ్లలో సందడి నెలకొంటుందని, ఇరుగుపొరుగు మహిళల ఆత్మీయ కలయికతో వాడవాడలా పండుగ వాతావరణం వెల్లివిరుస్తుందని అన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కలిసి బతుకమ్మ ఆడటం సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. పలకరింపుల్లో ఆప్యాయత, పాటల్లో అనుబంధం, ఆటల్లో ఉత్సాహం ఈ వేడుకకు మరింత వన్నె తెస్తాయని తెలిపారు.
బతుకమ్మను పేర్చే పెద్దల పక్కన కూర్చున్న చిన్నారులు పూల పేర్లను తెలుసుకుంటారని, పాటలు వింటూ స్థానిక సంప్రదాయాలను నేర్చుకుంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలా ప్రతి ఇంటా జరిగే పండుగ ఏర్పాట్లే పిల్లలకు సంస్కృతిని పరిచయం చేసే చక్కని సందర్భాలన్నారు. సంప్రదాయాలను ఆచరించడంతోపాటు వాటి వెనుక ఉన్న భావాన్ని వివరించినప్పుడే తరతరాలకు వాటిని అందించగలుగుతామని తెలిపారు.
ప్రకృతి ఒడిలో లభించే పూలతో జరుపుకునే బతుకమ్మ పర్యావరణం పట్ల బాధ్యతను గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. సహజ పూలతో బతుకమ్మలను పేర్చడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చెరువులు, జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పూలను ప్రేమించే సంస్కృతితోపాటు వాటిని అందించే ప్రకృతిని పరిరక్షించే చైతన్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.
పండుగ ఆనందం ప్రతి ఇంటికీ చేరాలని, పరస్పర గౌరవం, ఐక్యతతో ప్రజలంతా వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బతుకమ్మ నిమజ్జన సమయంలో నీటి వనరుల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు సంతోషంగా సంబరాల్లో పాల్గొనేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.
బతుకమ్మ పూల పరిమళాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, విజయదశమి అందరి జీవితాల్లో విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఆకాంక్షించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ములుగు జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# గిద్దెముత్తారం తండాలో కార్డన్ అండ్ సెర్చ్

**- 15 లీటర్ల గుడుంబా స్వాధీనం ముగ్గురిపై కేసులు నమోదు**

**- శాంతిభద్రతలపై ప్రజలకు సీఐ వై సతీష్ అవగాహన**

**చిట్యాల,అక్టోబర్ 17 మీ వార్త :**



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ



బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ సతీష్

చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై సతీష్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని గిద్దెముత్తారం తండాలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ ఎస్సై-2 ఓంపాల్ తో పాటు 27 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఆపరేషన్ సందర్భంగా తండాలోని ప్రతి సందు అనుమానిత ప్రాంతాలు ఇళ్లలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు అనగా నెంబర్ ప్లేట్లు ఆర్సీ ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ లేని 18 వాహనాలకు ఈ-చలాన్లు విధించారు. అలాగే అక్రమంగా తయారు చేసి నిల్వ ఉంచిన 800 లీటర్ల గుడుంబా వాష్ (బెల్లం పానకం) ను గుర్తించి ఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు. మరో 15 లీటర్ల నాటుసారా (గుడుంబా) ను స్వాధీనం చేసుకొని గుడుంబా తయారీ విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులు బాణోతు వీరన్న అజ్మీరా సునీత నూనావత్ సమ్మయ్యలపై కేసులు నమోదు చేయడం జరిగింది.

అనంతరం తండా ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై సతీష్ మాట్లాడారు. రానున్న విజయదశమి (దసరా) పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలకు తావులేకుండా సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో అమాయకులే లక్ష్యంగా సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారని తెలియని లింకులపై క్లిక్ చేయవద్దని ఓటీపీలు బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు. ప్రతి వాహనానికి పూర్తిస్థాయి పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు.గుడుంబా తయారీ విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యం నాశనమవడమే కాకుండా కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని ఇలాంటి అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని పీడీ యాక్ట్ వంటి చట్టాలు ప్రయోగిస్తామని హెచ్చరించారు. ?గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా లేదా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా రక్షణగా ఉంటారని తెలిపారు.

# కమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు.. శ్రీకృష్ణానగర్‌లో అన్నదాన కార్యక్రమం

**జవహర్‌నగర్, అక్టోబర్ 17 (వార్త ప్రతినిధి) :**

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కమ్మరాజుల వెంకటేష్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులు:**

ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, మాజీ వార్డు సభ్యులు బండకింద ప్రసాద్ గౌడ్ హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన



అనంతరం, వారు స్వయంగా భక్తులకు అన్నదానం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాజీ మేయర్ మేకల కావ్య మాట్లాడుతూ.. "దేవీ నవరాత్రులు అంటేనే శక్తి ఆరాధనకు ప్రతీక. అమ్మవారి ఆరాధనతో పాటు ఇలా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం వల్ల సమాజంలో మానవతా విలువలు పెరుగుతాయి. కమ్మరాజుల వెంకటేష్ లాంటి యువకులు ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయం" అని అన్నారు.

మాజీ కార్పొరేటర్ పల్లపు రవి మాట్లాడుతూ.. "నవరాత్రి వేడుకలు కేవలం పూజలకే పరిమితం కాకుండా, కాలనీలో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందించే వేదికగా మారడం సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు.

**భక్తి శోభతో కాలనీ:**

తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ శరన్నవరాత్రుల్లో ప్రతిరోజూ అమ్మవారికి ఒక్కో అవతారంలో ప్రత్యేక అలంకరణ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ద్వారా కులమతాలకు అతీతంగా అందరూ ఒకచోట చేరి ప్రసాదాన్ని స్వీకరించడం విశేషంగా నిలిచింది.

ఈ అన్నదాన కార్యక్రమంలో యువజన నాయకుడు మేకల భార్గవ్ రామ్, బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్ చారి, బోయినపల్లి నరసింహ, రాజు గౌడ్, అశోక్ గౌడ్, కాలనీ పెద్దలు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో సహకరించిన దాతలకు, యువకులకు, ప్రతి ఒక్కరికీ కమ్మరాజుల వెంకటేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్‌నగర్‌లో మహా చండీ హోమంలో పాల్గొన్న రజిత పరమేశ్వర్ రెడ్డి







**- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన**

**ఉప్పల్, అక్టోబర్ 17 ( మన మీ వార్త ):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని భారత్‌నగర్‌లో టీమ్-1 లిటిల్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన మహా చండీ హోమంలో రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కరువు కాటకాలు లేకుండా సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పుష్కలంగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రవి, బొట్టు టింకు, నక్క శివ, రాము, రాజేష్ యాదవ్, భువనేష్ యాదవ్, జశ్వంత్ యాదవ్, హరీష్ యాదవ్, మహేష్ యాదవ్, ప్రాణేష్ యాదవ్, దినేష్, నందీశ్వర్, సన్నీ, ప్రణయ్, అభిషేక్, పందు, శివ, భాను, లడ్డూ, సందీప్, జి. మణి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల ఆనంద హేల బతుకమ్మ సంబరాలు: లయన్స్ గవర్నర్ సుధాకర్ రెడ్డి

**- జనగామలో ఘనంగా లయన్స్ బతుకమ్మ సంబరాలు**

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

**జనగామ అక్టోబర్ 17:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ అన్ని కుటుంబాల ఆడబిడ్డలకు ఆనంద హేల అని లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక బతుకమ్మ కుంట ప్రాంగణంలో లయన్స్ క్లబ్ జనగామ సౌభాగ్య ఆధ్వర్యంలో పట్టణంలోని 9 లయన్స్ క్లబ్ ల సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు.
లయన్స్ గవర్నర్ గారి పిలుపు మేరకు జనగామ పట్టణంలోని జనగామ , ఆబాద్, మిలీనియం, సూర్య, బి బాయ్స్, డైమండ్స్, కింగ్స్ , గ్రేటర్, సౌభాగ్య లయన్స్ క్లబ్‌ల సభ్యులు, లయన్ లేడీస్ ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను అలంకరించి, ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం ఐకమత్యానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిందనీ గవర్నర్ అభివర్ణించారు.
ఈ వేడుకలో పాల్గొన్న ప్రథమ ఉప జిల్లా గవర్నర్ లయన్ పి. హరికిషన్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మల అలంకరణ పాటు ఆఆట పాటల తో అలరించిన మహిళలను అభినందించారు. అలాగే వారిని ప్రోత్సహించి సహకరించిన జిల్లా మార్కెటింగ్ చైర్మన్ లయన్ కృష్ణ జీవన్ బజాజ్, రీజియన్ చైర్మన్ లయన్ జైన రమేష్, పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ చందుపట్ల రవీందర్ రెడ్డి జనగామ ఏరియా లీడర్ లయన్ కె. రాజశేఖర్ రెడ్డి, జి ఎం.టి. కోఆర్డినేటర్ లయన్ ఎ. భిక్షపతి లను అతిథులు అభినందిం చారు. ఈ





వేడుకలో జడ్జీలు గా వ్యవహరించిన కమిటి సభ్యుల నివేదిక ప్రకారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ ఏడవ రోజున జనగామ లోని లయన్స్ క్లబ్ ల పక్షాన సంబరాలు నిర్వహించుటకు వచ్చిన ప్రతిపాదనను పాల్గొన్న అన్ని లయన్స్ క్లబ్ ల సభ్యులు ముక్తకంఠంతో ఆమోదించారు.

ఈ వేడుకలో జోన్ చైర్మన్లు కన్నా శ్రీనివాస్, బానోత్ రవి నాయక్, గొడిశాల శివరామకృష్ణ, రీజియన్ సెక్రటరీలు తీరుపల్లి కృష్ణా రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, జిల్లా క్యాబినెట్ సభ్యులు పబ్బ చంద్రశేఖర్, ఎ.నర్సిరెడ్డి, బైరు వెంకటెశ్వర్లు, దోర్నాల వెంకటేశ్వర్లు, నాగబండి రవీందర్, కె. మధుసూదన్, కుతాటి ఉపలయ్య, ఎల్. శంకర్ లింగం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మిలీనియం క్లబ్ అధ్యక్షుడు బాల్దె మల్లేశం, సూర్య క్లబ్ అధ్యక్షుడు లయన్ నాంపల్లి శ్రీనివాస్, ఆబాద్ క్లబ్ అధ్యక్షుడు వనమాల సోమయ్య, రేనుకుంట కృష్ణ, బెలిదే వీరన్న, జె. అశోక్ రెడ్డి, ఉస్మాన్, వై. లక్ష్మినారాయణ, డా. కె. మల్లారెడ్డి, జి. బలకేశవ రెడ్డి, పానుగంటి యాదగిరి, బత్తిని శ్రీనివాస్, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు, లయన్స్ మిత్రులు, లయన్స్ లేడీస్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జనగామ సౌభాగ్య సభ్యులు ఎస్. జయలత, టి. భారతమ్మ పజ్జూరి శారద, బి. శ్రీలత, పబ్బ భాగ్యలక్ష్మి, చందా మాధవీలత బెలిదే రాజేశ్వరి తదితరులు కార్యక్రమాన్ని పర్య వేక్షించగా ఇతర క్లబ్ ల మహిళా సభ్యుల ప్రత్యేక చొరవతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకలో పట్టణ లయన్స్ క్లబ్ ల నుండి పాల్గొన్న వారిలో జైన సంధ్యా రాణి, జి. క్యాథరిన్, టి. సుఖేషిని రాణి, కన్న సత్యమ్మ, వనమాల శోభారాణి, రేణుకుంట రాజేశ్వరి, కన్న స్రవంతి, దుడుక లహరి, శ్రీరామోజు సిందుజ, మేకల మాలతి, యేల శ్వేత, బాల్దే సువర్ణ, ఏనుగు ఊర్మిళ, కడకంచి స్వరూప, బై రు విజయ, పానుగంటి సంతోషిణి, నల్ల కవిత, బి. మంజుల, వై. అరుణ తదితర మహిళలతో పాటు పట్టణం లోని అన్ని లయన్స్ క్లబ్‌ల మహిళలు ఐక మత్యంతో పాల్గొని బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని పలువురు మహిళలు తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

## దోమల నివారణ ఆరోగ్య పరిరక్షణ

**లక్ష్మణ చందా అక్టోబర్ 17 (మన మీ వార్త)**

జాతీయ కీటక జనిత నియంత్రణ విభాగంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ ప్రత్యూష ఆదేశాల మేరకుపీచర గ్రామంలో ఈరోజు గ్రామస్తులకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నటరాజ్ గౌడ్ తెలిపారు.ఈ వైద్య శిబిరాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వనజ స్వయంగా సందర్శించి పరిశీలించారు ఈ శిబిరంలో గ్రామస్తులకు సాధారణ పరీక్షలతో పాటు అనారోగ్యంతో ఉన్నవారికి తగిన మందులు అందిస్తూ, సీజనల్ వ్యాధులు మరియు వ్యక్తిగత పరిశుభ్రత, పోషక ఆహార ప్రాముఖ్యతపై, నాణ్యమైన తాగునీరు వాడకంపై ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ గౌడ్ ఆరోగ్య అవగాహన కల్పిస్తూ,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిప్పని రాజేశ్వర్, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నటరాజ్ గౌడ్, ఆరోగ్య సహాయకుడు శివకృష్ణ గౌడ్, ఏఎన్ఎం వనజ,సత్యమ్మ పంచాయతీ సెక్రెటరీ సాయిప్రసాద్, ఆశాలు పుష్ప మరియు సునీత పాల్గొన్నారు.





## ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026



**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026'లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు గార్లతో కలిసి +ఔవీజ కమిషనర్ శ్రీ టి. వెంకన్న పాల్గొన్నారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు మారథాన్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. విజేతలకు మెడల్స్ అందజేసి అభినందించారు.

## బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

**- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**

**- పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి**

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



**జీడబ్ల్యూఎంసీ, అక్టోబర్ 17:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో భక్తిశ్రద్ధలతో, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు గ్రేటర్



వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కమిషనర్ టి. వెంకన్న తెలిపారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం కమిషనర్ నగర పరిధిలోని వివిధ బతుకమ్మ ఘాట్‌లు, చెరువులు, కుంటలు, కృత్రిమ నీటి కొలనుల వద్ద చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. హసన్‌పర్తి, చింతగట్టు, అబ్బసాయికుంట, భీమారం, గోపాలపూర్, వడ్డేపల్లి, సోమిడి, బంధం చెరువు, ఉర్సు, బేస్తం చెరువు , మెట్టుదర్వాజ, శివనగర్, కట్టమల్లన్న, సొసైటీ కాలనీ, కాశిబుగ్గ, పద్మనగర్, చిన్నవడ్డేపల్లి, తోటమైదానం, భద్రకాళి, పద్మాక్షి గుండం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా భద్రకాళి ప్రాంతంలో నిర్మించిన కృత్రిమ నీటి కొలను, పార్కింగ్ ప్రాంతం, పోతననగర్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన బేబీ పాండ్లను తనిఖీ చేసి, వాటి నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆదివారం (ఈ నెల 18న) నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే చేపట్టామని తెలిపారు. ఇంకా ఏవైనా పనులు మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేసి, వేడుకలకు అన్ని ప్రాంతాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఘాట్‌ల వద్ద పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, రహదారుల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుంతలను వెంటనే పూడ్చివేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పండుగ ముగిసే వరకు పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవి కుమార్, సంజయ్ కుమార్, మహేందర్, మాధవి,ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్ , డీఈలు, ఏఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రగతి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రారంభోత్సవం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి**

**- సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ బిక్షం రెడ్డి కి రాజకీయ, వ్యాపార రంగ నిపుణులు**

**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 17 (మన మీ వార్త):**





మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వరంగల్ ప్రధాన రహదారిలో మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ బిక్షం రెడ్డి, ఆధ్వర్యంలో ప్రగతి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, పలువురు రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు పాల్గొని ప్రగతి చిట్ ఫండ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. వినియోగదారులకు అత్యుత్తమ చిట్ఫండ్ సేవలు అందిస్తూ, వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెందాలని, వచ్చే దసరా పండగ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రగతి చిట్ ఫండ్ బ్రాంచీలు ఏర్పాటు చేయాలని సింగిరెడ్డి పద్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న కాట సునీత--రాజేష్ గౌడ్ దంపతులు

- అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు



**పటాన్‌చేరు, అక్టోబర్ 17 (మీ వార్త ప్రతినిధి):**

బీరంగూడ డివిజన్ పరిధిలోని పోచమ్మ అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకుడు ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కాట సునీత--రాజేష్ గౌడ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం కాట సునీతమ్మ మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవం అన్నపూర్ణ కాలనీలో అమ్మవారి ఉత్సవాలు

- గట్టోజి సాయినాథ్--వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ!



**బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 17 (మన మీ వార్త):**

బోడుప్పల్ అన్నపూర్ణ కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా గట్టోజి సాయినాథ్, గట్టోజి వరలక్ష్మి దంపతులు వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదం అందించి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , మాజీ కార్పొరేటర్ ఓదుటూరి వెంకటేశ్ గుప్తా, తోటకూర రవీందర్ యాదవ్ హాజరయ్యారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.భక్తి.. సేవ.. ఐక్యతే లక్ష్యంగా ఉత్సవాలు!అన్నపూర్ణా కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజూ విభిన్న ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవ కమిటీ, యువజన సంఘం సభ్యులతో పాటు మహిళలు సైతం ఉత్సాహంగా భాగస్వాములవుతూ కార్యక్రమాల విజయానికి విశేష కృషి చేస్తున్నారు. భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీలో ఐక్యత, సోదరభావం చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.ఇదే ఉత్సాహంతో రేపు జరగనున్న దసరా ఉత్సవాలను సైతం మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సహకరిస్తున్న దాతలకు, ముఖ్య అతిథులకు, భక్తులకు, మహిళలకు, యువతకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పువ్వులనే పూజించే గొప్ప సంస్కృతి బతుకమ్మ





**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (17):**

ఎక్కడైనా పువ్వులతో దేవుడికి పూజలు చేస్తాం.. కానీ పువ్వులనే దేవతగా భావించి పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ఆడపడుచులదని చెప్పవచ్చు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా సద్దుల బతుకమ్మ వేడుకలను శనివారం మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి ఆడిపాడుతూ సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై బతుకమ్మలను ఏర్పాటు చేసి, గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలారు. అనంతరం మహిళలు బతుకమ్మలతో కోలాటాలు ఆడుతూ పండుగ వేడుకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# ట్రాఫిక్ అడ్వైజరీ మెమో ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

**మన మీ వార్త అక్టోబర్ 17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఉర్సు రంగలీల మైదానంలో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా తేదీ 20-10-2026 మధ్యాహ్నం 03:00 గంటల నుండి తేదీ 21-10-2026 ఉదయం 03:00 గంటల వరకు ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి.

**ట్రాఫిక్ మళ్లింపులు**

ఖమ్మం నుండి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు పున్నేలు క్రాస్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లవలెను.

కరీంనగర్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లవలెను.

హైదరాబాద్ నుండి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు క్రాస్ మీదుగా వెళ్లవలెను.



ఉర్సు గుట్టకు వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు సందర్శకుల సౌకర్యార్థం క్రింది ప్రదేశాలలో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడమైనది.

హన్మకొండ హంటర్ రోడ్ నుండి వచ్చే వాహనాలు: కొలంబో హాస్పిటల్, బీఆర్ నగర్ ఎదురుగా గల గానుగ ఆయిల్ పాయింట్ వద్ద, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్ మరియు జేఎస్ఎం స్కూల్ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.

కడిపికొండ నుండి వచ్చే వాహనాలు: భారత్ పెట్రోల్ పంపు వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.

ఆర్టీఓ జంక్షన్ నుండి వచ్చే వాహనాలు: లవ్లీ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఖాళీ స్థలంలో, తాళ్ల పద్మావతి కాలేజీ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.

కరీమాబాద్ నుండి వచ్చే వాహనాలు: భీరన్న గుడి వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు.

ప్రజలు, సందర్శకులు ట్రాఫిక్ మళ్లింపులను పాటిస్తూ, తమ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలిపి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది.

ఎన్. శ్వేత, ఐపీఎస్ వరంగల్ పోలీస్ కమిషనర్.

# తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ

**(మన మీ వార్త న్యూస్) అక్టోబర్ 17, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-**





ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ నిరంతర పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. తీవ్ర వర్షాభావం, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా రబీలో వరి పంట సాగు చేయవద్దని రైతులకు హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మున్సిపల్ కమిషనర్లు,మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, ఆర్.డబ్ల్యూ.ఎస్,గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో తాగునీటి సరఫరా,పంటల సాగు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ప్రధాన తాగునీటి వనరులుగా ఉపయోగపడుతున్న నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను ఏదోవిధంగా కాపాడుకోగలిగినా రబీలో పంటలకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుందని ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో అతి తక్కువ నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున తగినంత విద్యుత్ ఉత్పత్తి జరుగక, పంటలకు కరెంటు సరఫరాకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు యాసంగిలో తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పు దినుసులు వంటి పంటలు విత్తుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జలాశయాలలో నిలువ ఉన్న నీటిని పూర్తిగా తాగునీటి అవసరాలకు ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వచ్చే పది నెలల వరకు నిజామాబాద్ నగరం సహా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో ప్రతి నివాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ప్రైవేట్ వ్యాపారులను, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి జాగ్రత్తలు సూచించారు. ఖరీఫ్ లో ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి పంటకు ప్రస్తుతం మార్కెట్ మంచి గిట్టుబాటు ధర పలుకుతోందని, దిగుబడులు కూడా ఆశించిన మేరకు చేతికి అందుతున్నాయని అన్నారు. అయితే రైతులు తమ పంటను నగదు పద్ధతిన విక్రయించాలని అన్నారు. గతంలో రైతుల నుంచి పంట సేకరించి నగదు చెల్లించకుండా పలువురు వ్యాపారులు మోసగించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని, నగదు చెల్లింపులు వెంటదివెంట జరిపే వారికే ధాన్యం విక్రయించాలని హితవు పలికారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎక్కడ కూడా నీటి వృథా జరుగకుండా గట్టి నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చోట మరమ్మతులు, తాగునీటి సరఫరా పనులు వేగంగా చేపట్టేలా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అవసరమైన చోట తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప కొత్త బోర్లను తవ్వించకూడదని అన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. వార్డుల వారీగా పనిచేస్తున్న బోర్లు, వినియోగంలో లేని బోర్లను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ నల్లా కనెక్షన్లను తొలగించి నీటి వృథాను అరికట్టాలని, జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల్లో నీటి పొదుపుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా జవాజి శ్రీధర్ రెడ్డి

- రైతుల సంక్షేమం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: జవాజి శ్రీధర్ రెడ్డి

**నాచారం, అక్టోబర్ 17 (మన మీ వార్త ):**





భారతీయ జనతా పార్టీ నాచారం డివిజన్ నాయకుడు జవాజి శ్రీధర్ రెడ్డి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, పార్లమెంట్, జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్‌లకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

అదేవిధంగా నాచారం బీజేపీ సీనియర్ నాయకుడు, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జవాజి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష

**పటాన్‌చెరు, అక్టోబర్ 17 (మీ వార్త ప్రతినిధి):**

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ మాజీ కౌన్సిలర్ ప్రమోద్ రెడ్డి ఆహ్వానం మేరకు నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు.అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని భారతి నగర్ డివిజన్ పరిధిలో ఉన్న సిరికి ఆఫీస్, ఎఫ్ పార్క్, నేతాజీ ఫంక్షన్ హాల్, ఓల్డ్ ఎం.ఐ.జీ. బి పార్క్‌లలో నిర్వహించిన దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్ ఎం.ఐ.జీ. బి పార్క్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.





**ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

ఈ సందర్భంగా వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, దేవి నవరాత్రులు అమ్మవారి శక్తి, వైభవానికి ప్రతీకలని అన్నారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులకు, పాల్గొంటున్న భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన బీరంగూడ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్

- సనాతన ధర్మ పరిరక్షణ మనందరి బాధ్యత -- ఈర్ల రాజు ముదిరాజ్

**పటాన్‌చెరు, అక్టోబర్ 17 (మీ వార్త ప్రతినిధి):**

పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్‌పూర్ మండల పరిధిలోని అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**పలు ప్రాంతాల్లో పూజలు, అన్నదాన కార్యక్రమాలు**

కిష్టారెడ్డిపేట్ గ్రామంలో దొంతు పెంటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఈర్ల రాజు ముదిరాజ్ పాల్గొని దుర్గామాతను దర్శించుకున్నారు. దుర్గా నగర్ కాలనీలో సముద్రాల రాకేష్, ఆయన మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు.

అలాగే పటేల్‌గూడ గ్రామంలోని సూర్యోదయ కాలనీలో రఘు, ఆయన మిత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పటేల్‌గూడలో రొయ్యల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు



తెలిపారు. హరివిల్లు కాలనీలో కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత పూజలు, అన్నదాన కార్యక్రమాల్లోనూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ నిర్వాహకులు, భక్తులు ఆయనకు స్వాగతం పలికారు.

**భక్తి ఆధ్యాత్మిక బలాన్ని ఇస్తుంది.. సేవ సమాజంలో ఐక్యతను పెంచుతుంది**

ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తిభావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పే పవిత్ర పండుగలని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని, ధర్మాన్ని ఆచరిస్తూ సేవాభావంతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దుర్గామాత ఆరాధన స్త్రీశక్తికి, ధర్మానికి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు యువతలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను బలోపేతం చేస్తాయని తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు మానవత్వాన్ని చాటిచెబుతాయని, భక్తితో పాటు సేవా దృక్పథం కూడా ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు.

పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ కలిపే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో అమీన్‌పూర్ మండలంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

**నాయకులు, కార్యకర్తల హాజరు**

ఈ కార్యక్రమాల్లో బీజేపీ ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు సముద్రాల రాకేష్ గుప్తా, ఈర్ల భాస్కర్ ముదిరాజ్, రొయ్యల రాజు ముదిరాజ్, కమ్మరి భాస్కర్ చారి, భైరవ్, నాగరాజ్, శ్రీనివాస్, కల్వకుంట్ల రాకేష్ గుప్తా, విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్, దేవేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు పెద్ద సంఖ్యలో భవానీ మాలధారులు, బీజేపీ కార్యకర్తలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# జవహర్ నగర్ లో ఘోర రోడ్డు ప్రమాదం.

**జవహర్ నగర్ , అక్టోబర్ 17: (వార్త ప్రతినిధి)**

జవహర్‌నగర్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా జియోమార్ట్ డెలివరీ బాయ్ అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

**ఘటన వివరాలు:**

జవహర్ నగర్ ఎస్.హెచ్.ఓ సైదులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన గంధమల్ల స్వామి (32) జియోమార్ట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే అక్టోబర్ 17, 2026న మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో తన యాక్టివా 6జి స్కూటర్‌పై అంబేద్కర్ నగర్ సమీపంలోని రోజ్ గార్డెన్ వద్ద డెలివరీ పూర్తి చేసుకుని దమ్మాయిగూడ వైపు బయలుదేరాడు.

అదే సమయంలో వెనుక నుంచి అత్యంత వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు (నెం.TS08Z0171) డ్రైవర్ నిర్లక్ష్యంగా ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో స్వామి స్కూటీని కుడి వైపున బలంగా ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పి కిందపడిన స్వామి తలపై నుంచి బస్సు వెనుక చక్రం దూసుకెళ్లడంతో ఆయన అక్కికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.



**కుటుంబంలో విషాదం:**

మృతుడు స్వామి నిరుపేద కుటుంబానికి చెందినవాడు. తల్లి గంధమల్ల లక్ష్మితో కలిసి అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటూ, డెలివరీ బాయ్‌గా వచ్చే స్వల్ప ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కొడుకు మృతితో తల్లి కన్నీరుమున్నీరవుతోంది. ఒక్కగానొక్క కొడుకును కోల్పోయిన ఆ కుటుంబాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

**స్థానికుల ఆగ్రహం:**

ఈ రోడ్డు ప్రమాదం జరిగిన అంబేద్కర్ నగర్ - దమ్మాయిగూడ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు అతివేగంగా నడుపుతున్నారని, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ మార్గంలో వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**పోలీసుల కేసు నమోదు:**

మృతుని తల్లి గంధమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తూ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు అధికారి ఎస్.ఐ ఆర్. రామకృష్ణ తెలిపారు. Cr.No. 1458/2026 గా కేసు నమోదు చేసి, బస్సును సీజ్ చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్.హెచ్.ఓ సైదులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# అమీన్‌పూర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

- కాటా సునీత రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- జబర్దస్త్ కళాకారుల సందడి.. ఉషారాణి పాటలతో హోరెత్తిన సంబరాలు
- ఆకట్టుకున్న కాజీపల్లి కళాకారుల ప్రదర్శనలు
- ఉత్తమ బతుకమ్మలకు అవార్డుల ప్రదానం
- ముఖ్య అతిథులుగా గూడెం యాదమ్మ, సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చేరు అక్టోబర్ 17 మీ వార్త ప్రతినిధి :**

అమీన్‌పూర్ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ సంబరాలు అమీన్‌పూర్‌లో అంబరాన్నంటాయి. పూల సోయగాలు, మహిళల ఆటపాటలు, కళాకారుల వినోద ప్రదర్శనలతో అమీన్‌పూర్ డివిజన్ పండుగ శోభను సంతరించుకుంది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు కాటా సునీత రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్





రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యంత ఆకర్షణీయంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు ఉత్తమ బతుకమ్మ అవార్డులను అందజేసి ప్రోత్సహించారు. జబర్దస్త్ కళాకారులు రచ్చ రవి, వినోద్ తమ హాస్య ప్రదర్శనలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించగా, ప్రముఖ గాయని ఉషారాణి ఆలపించిన పాటలు మహిళలను ఉర్రూతలూగించాయి. కాజీపల్లి కళాకారుల బృందం ప్రదర్శనలు వేడుకలకు మరింత వన్నె తెచ్చాయి. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు, కళాకారుల ప్రదర్శనలతో వేడుకల ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా కాటా సునీత రాజేష్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలంతా ఒకే వేదికపైకి వచ్చి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్య అతిథులు గూడెం యాదమ్మ, సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగల్లో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉందన్నారు. సంప్రదాయాలను కాపాడుకుంటూ అందరూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. మహిళల ఉత్సాహం, కళాకారుల సందడి, ఆత్మీయ కలయికల మధ్య అమీన్‌పూర్‌లో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా సాగాయి.

## వడ్యాల్ రాచాపూర్ మధ్య చెరువు వద్ద నీటిని పరిశీలిస్తున్న మాజీ జెడ్పిటిసి పలు గ్రామాల సర్పంచులు

**(లక్ష్మణ చందా,అక్టోబర్ 17 మన మీ వార్త) :**

మండలంలోని వడ్యాల్ - రాచాపూర్ గ్రామాల మధ్య ఉన్న చెరువుకు సరస్వతీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి చెరువును నింపారు. పంటలు, పశువుల అవసరాల దృష్ట్యా రైతుల విజ్ఞప్తి మేరకు ఈ చర్యలు చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరి రావు, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కృషితో సరస్వతీ కెనాల్ ద్వారా నీటి విడుదల సాధ్యమైందని నాయకులు,మాజీ జడ్పీటీసీ ఓసా రాజేశ్వర్ తెలిపారు. ఇలాగే ప్రతీ గ్రామంలో వీడీసీ , సర్పంచ్ లు కలిసి చెరువు లో నీరు నింపుకోవాలి అని ఓసా రాజేశ్వర్ అన్నారు .ఈ కార్యక్రమంలో వడ్యాల్, రాచాపూర్, కనకాపూర్ గ్రామాల సర్పంచులు నరేష్ , వెంకట్ రాజు ,మహేష్ ,వీడీసీ సభ్యులు, గ్రామస్తులతో పాటు లక్ష్మణచంద మాజీ జడ్పీటీసీ ఓసా రాజేశ్వర్ పాల్గొన్నారు.



## మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ



**అక్టోబర్ 18,10,2026, పరకాల ప్రతినిధి మన మీ వార్త :**

హనంకొండ జిల్లా పరకాల ఆత్మకూర్ మండలం లోని ఆత్మకూరు పెద్దాపురం గూడె పాడు హౌస్ గుజూర్ గ్రామాలలోని నిరుపేద మైనారిటీ మహిళలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 42 కుట్టు మిషన్ల పంపిణీ మన ప్రియతమ నాయకులు పరకాల శాసనసభ్యులు గౌరవ రేవూరి ప్రకాశ్ రెడ్డి సార్ చేతుల మీదుగా పరకాల క్యాంప్ ఆఫీసులో కుట్టు మిషన్ల పంపిణీ చేయడం జరిగినది నిరుపేద మైనార్టీ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వము ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు ఇందిరమ్మ ప్రభుత్వంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నదని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మండల పార్టీ అధ్యక్షులు సమన్వయ కమిటీ సభ్యులు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనార్టీ మహిళలు పాల్గొన్నారు.

## రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠకు పబ్బ మహేష్ గుప్తా విరాళం



**శివ్వంపేట:** గ్రామంలోని రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి శివ్వంపేట గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా తన సొంత నిధులనుండి రూ .50 వేల రూపాయల విరాళాన్ని శనివారం అందజేశారు.ఆలయ అభివృద్ధి,ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి విరాళం అందించిన పబ్బ మహేష్ గుప్తాను గ్రామస్థులు అభినందించారు.

## నర్సాపూర్ (డబ్ల్యు) గ్రామ పంచాయతీకి కొత్త కంప్యూటర్



**లక్ష్మణ్‌చందా, అక్టోబర్ 17 (మన ఈ వార్త) :**

మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యు)గ్రామ పంచాయతీ కార్యాలయానికి గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త కంప్యూటర్‌ను కొనుగోలు చేశారు.సర్పంచ్ రేణి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కొత్త కంప్యూటర్‌తో పంచాయతీ సేవలు మరింత వేగవంతంగా ప్రజలకు అందుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నాగుర్ల వెంకటేశ్వర్లు



**పరకాల ప్రతినిధి మన మీ వార్త అక్టోబర్ 18,10, 2026 :**

భూపాలపల్లి జయశంకర్ జిల్లా కొత్తపల్లి: గోరిశ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోరికొత్తపల్లి నవదుర్గ మాత ఆలయంలో ఏడవ రోజు మహాలక్ష్మి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఫర్టిలైజర్, సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు శ్రీశ్రీశ్రీ నిత్యానందగిరి స్వామి, మాతా మైత్రేయి, సద్గురు శ్రీశ్రీశ్రీ మహాదేవి మాతాజీ ఆశీర్వాదాలతో ఆలయ కమిటీ, భక్త కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.

ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...

ఈ సందర్భంగా నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గోరికొత్తపల్లి నవదుర్గ మాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు, ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సూదనబోయిన ఓంప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఘుసాల తిరుపతి, కార్యదర్శి వంచనగిరి వీరేశం, నాయకులు మటికె సంతోష్,భక్త కమిటీ అధ్యక్షులు కరెట్లపెల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు తుమ్మనపెల్లి ఓమాజీ, మానూరి రాజేందర్, వన్నాల శివాజీ, అప్పని సంపత్, బాషిపెల్లి అశోక్, వంచనగిరి లింగారావు, ప్రచార కార్యదర్శి నిమ్మల రాజు తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**– మాజీమంత్రి కొండా సురేఖ**

మన మీ వార్త ఎకో17 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




పూలను పూజించే పండుగ...
ప్రకృతిని ఆరాధించే పండుగ...
తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ఆడపడుచుల ఐక్యతకు ప్రతీక మన బతుకమ్మ పండుగ..!!
రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను...!!
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి...!!
తెలంగాణ ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# మునిపల్లిలో ఘనంగా దుర్గాదేవి కుంకుమార్చన, మహాఅన్నదానం

**– భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు భక్తులకు అన్నప్రసాద వితరణ**





లక్ష్మణ చందా,అక్టోబర్ 17( మన మీ వార్త) :

**లక్ష్మణచాంద:** నిర్మల్ జిల్లా, లక్ష్మణచాంద మండలంలోని మునిపల్లి గ్రామంలో దుర్గాదేవి అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి, గ్రామ ప్రజలందరిపై దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.

అనంతరం అన్నదాతలు అయిండ్ల స్వర్ణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అయిండ్ల గీతాంజలి, భూపాల్ రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిపారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడుతున్న మహిళపై కత్తితో దాడి

**– మల్కెపల్లిలో వ్యక్తిపై కేసు నమోదు**

కాసిపేట, అక్టోబరు 17: (మన మీ వార్త మండల ప్రతినిధి) :

బతుకమ్మ ఆడుతున్న మహిళపై కత్తితో దాడి చేసిన ఘటన కాసిపేట మండలం మల్కెపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు.ఎస్సై కథనం ప్రకారం.. మల్కెపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల అనూష శుక్రవారం రాత్రి గ్రామంలోని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్నారు. అదే గ్రామానికి చెందిన పోతరవేణి మల్లేష్ మద్యం మత్తులో అక్కడికి వచ్చి పాటల శబ్దం తక్కువగా ఉందంటూ మహిళలతో వాగ్వాదానికి దిగాడు. తాము కూడా డబ్బులు ఇచ్చామని చెబుతూ దుర్భాషలాడాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి అనూషపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోతరవేణి మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం వెల్లడించారు.

# సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు విద్యుత్ శాఖ ఏఈ మంగమ్మ

ఖానాపురం అక్టోబర్ 17 (మీవార్త ప్రతినిధి ) :



తెలంగాణ ప్రజలకు,విద్యుత్ వినియోగదారులకు మహిళలకు, విద్యుత్ శాఖ సిబ్బందికి సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని టీజీఎన్ పీ డీసీఎల్ ఖానాపురం మండలం ఏఈ అంగోతు మంగమ్మ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆమె ఆకాంక్షించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలతో బతుకమ్మను అలంకరించి భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.

# తెలంగాణ ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

**– టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మల్లేష్ గౌడ్**

హైదరాబాద్ అక్టోబర్ 17 (మీవార్త ప్రతినిధి ) :

మహిళల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఒజెజీఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి. మల్లేష్ గౌడ్ తెలంగాణ ఆడపడుచులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



ఈ పండుగ సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవడం విశేషమని పేర్కొన్నారు.

ప్రకృతిని ఆరాధిస్తూ, పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ప్రజల ఐక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతాయని తెలిపారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, తెలంగాణ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

# మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





ఖానాపురం, అక్టోబర్ 17 (మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు.వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని నూతనంగా ఏర్పాటైన బాలు తండా గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులతో, ధర్మారావుపేట గ్రామంలో మహిళా భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో శనివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ధర్మరావుపేటలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందిస్తూ, వారు నైపుణ్యం కలిగిన రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలు కోటి రూపాయలకు పైగా వ్యాపారాలు నిర్వహించే స్థాయికి ఎదిగి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాకాల సరస్సు చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. సరస్సు కాలువల మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ.150 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. నిధులు మంజూరైన వెంటనే ఈ యాసంగిలో రెండు కాలువలను సరస్సు నుంచి చివరి వరకు కాంక్రీట్‌తో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన కాలువలను వచ్చే యాసంగిలో పూర్తి చేస్తామని చెప్పారు.

ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. పాకాల వాగు నుంచి పైప్‌లైన్ ద్వారా గ్రామాలకు నీటిని సరఫరా చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గ్రామంలోని పలువురు రైతులకు భూమి పట్టాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, సంబంధిత అధికారులతో మాట్లాడి భూముల సర్వే అనంతరం రైతులకు పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామానికి బస్సులు సరిగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన ఆర్టీసీ డీఎంతో మాట్లాడి గతంలో మాదిరిగా బస్సు ట్రిప్పులు నడిచేలా చూస్తానని హామీ ఇచ్చారు.బాలు తండా గ్రామపంచాయతీ భవనం, ధర్మారావుపేట మహిళా భవన నిర్మాణాలను మూడు నెలల్లో పూర్తి చేయాలని సంబంధిత నాయకులు, అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో నర్సంపేట ఏఎంసీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు,ఖానాపురం సొసైటీ చైర్‌పర్సన్ వల్లే శ్రీనివాస్ యాదవ్,ఆత్మ చైర్మన్ ఎడ్లభిక్షంరెడ్డి, ధర్మరావుపేట సర్పంచ్ మాద్రాజు వెంకన్న ,బాలు



తండా గ్రామ సర్పంచ్ బానోత్ సునీత బాలకిషన్, తహసీల్దార్ నంగునూరి రమేష్, ఎంపీడీవో వనపర్తి అద్వైత, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటి రంజిత్ రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్,అశోక్ నగర్ సర్పంచ్ జాడి అచ్యుతం, బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణిగోవర్ధన్ రెడ్డి, వేపచెట్టుతండా సర్పంచ్ మూడు దేవేందర్, బండమీదితండాసర్పంచ్ బోడ రమేష్, బోటుమీదితండా సర్పంచ్ భానుప్రసాద్, సొసైటీ డైరక్టర్ శివరాత్రి వెంకన్న, దేవినేని వేణుగోపాల్ రావు,గట్టి సారంగపాణి, ప్రజాప్రతినిధులు, నాయకులు, ధర్మరావుపేట పంచాయతీ కార్యదర్శి ఎన్ .అనిత,బాలుతండా పంచాయతీ కార్యదర్శి పి.స్రవంతి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల వీవోలు, సీఏలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా గుజ్జ సత్యంకు అవకాశం కల్పించాలి

**– సోమాజిగూడ బీసీ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**

హైదరాబాద్, అక్టోబర్ 17 ( మన మీ వార్త):

బీసీ హక్కుల సాధన, చేనేత కార్మికుల సంక్షేమం, విద్యా, వైద్య రంగాల్లో గుజ్జ సత్యం చేస్తున్న సేవలను గుర్తించి, తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం కల్పించాలని వివిధ బీసీ సంఘాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమాజిగూడలో నిర్వహించిన బీసీ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గుజ్జ సత్యం అభ్యర్థిత్వాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ వర్గాల అభ్యున్నతికి, చేనేత కార్మికుల సంక్షేమానికి, సామాజిక న్యాయం సాధనకు కృషి చేస్తున్న గుజ్జ సత్యంకు శాసనమండలిలో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా బీసీల సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని సమావేశంలో పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయన సేవలను గుర్తించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాజ్యాధికార పార్టీ





వ్యవస్థాపకులు వీజీఆర్ నారగోని, సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ప్రాంత పద్మశాలి సంఘం కోశాధికారి బొమ్మ రఘురాం నేత, బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్రా కుమారస్వామి, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మేకల పరశురాములు, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు చిక్కా దేవదాసు, పద్మశాలి సంఘం నాయకులు జెల్లా నరేందర్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుర్రం రాఘవేందర్, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు నిమ్మల వీరన్న, జాతీయ బీసీ సంఘం మహిళా విభాగం జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు దుస్సా యాదగిరి పాల్గొన్నారు.

అలాగే ఖమ్మం జిల్లా నాయకులు వెంకటరామయ్, బద్రి, మాధవరావు, రాజుతో పాటు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని గుజ్జ సత్యంకు తమ మద్దతు ప్రకటించారు. ఆయనకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# శ్రామికుల ఇళ్లలో దసరా వెలుగులు..
# నందారం కుటుంబం ఆత్మీయ కానుక!

పటాన్ చేరు అక్టోబర్ 17 మీ వార్త ప్రతినిధి :

**– 450 మంది పారిశుద్ధ్య, వాటర్ బోర్డు కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ..**

**– కార్మికులను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించిన మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్..**

అమీన్‌పూర్, నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం చెమటోడ్చే పారిశుద్ధ్య కార్మికులు.. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు అహర్నిశలు శ్రమించే వాటర్ బోర్డు సిబ్బంది.. వారి కష్టాన్ని గుర్తించి పండుగ వేళ ఆత్మీయ కానుక అందించారు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్. దసరా పండుగను పురస్కరించుకుని అమీన్‌పూర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ (వాటర్ బోర్డు) సిబ్బంది సుమారు 450 మందికి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు షర్టులు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులను సొంత కుటుంబ సభ్యుల్లా ఆదరించి ఆత్మీయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. ఎండనక, వాననక ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య, వాటర్ బోర్డు కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. వీధులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా కృషి చేస్తున్న కార్మికులే సమాజానికి నిజమైన సేవకులని పేర్కొన్నారు. తెలంగాణలో అతిపెద్ద పండుగైన విజయదశమిని కార్మికులు తమ కుటుంబాలతో సంతోషంగా జరుపుకోవాలనే సంకల్పంతోనే నూతన వస్త్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్మికులను తమ కుటుంబంలో భాగంగానే భావిస్తామని, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటమే తమ కుటుంబానికి అసలైన పండుగ ఆనందమని అన్నారు. కార్మికుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.



అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమయ్యే తమ శ్రమను గుర్తించి, దసరా పండుగ వేళ పెద్దదిక్కుగా నిలిచి నూతన వస్త్రాలు అందించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తమను కుటుంబ సభ్యుల్లా ఆదరించిన నందారం నరసింహ గౌడ్ కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నరసింహ గౌడ్ కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిష్ఠించి ప్రజాసేవలో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎన్‌జీ యువసేన సభ్యులు ఇంద్రేశం ప్రకాష్ ముదిరాజ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నందారం శ్రీనివాస్ గౌడ్, దాసు యాదవ్, శేఖర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మల్లేష్, భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రముఖులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం నిలబడండి

న్యాయవిద్య పూర్తి చేసుకుని వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులపై దేశం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయం కోసం ధైర్యంగా నిలబడాలని, వ్యక్తుల స్వేచ్ఛను కాపాడాలని సూచించారు. వృత్తిలో నిజాయతీగా ఉంటూ రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం కర్ణాటక బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ 34వ స్నాతకోత్సవంలో సీజేఐ పాల్గొని మాట్లాడారు. న్యాయవిద్య అంటే చట్టాలను చదివి తెలుసుకోవడం మాత్రమే కాదని చెప్పారు. విభిన్న అభిప్రాయాలను అర్థం చేసుకోవడం, సమాజానికి సేవ చేయడం కూడా అందులో భాగమని వివరించారు. న్యాయవిద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూనే, వారి నుంచి ఎన్నో ఆశిస్తున్నానని సూర్యకాంత్ అన్నారు. చట్టాలపై అవగాహన ఉండటంతో పాటు, న్యాయం కోసం నిలబడే ధైర్యం కూడా న్యాయవాదులకు ఉండాలని చెప్పారు. తమ సమస్యలను చెప్పుకోలేని వారి మాటలను కూడా ఓపికగా వినాలని సూచించారు. న్యాయవృత్తి అంత సులభమైనది కాదని సీజేఐ అన్నారు. చట్టాలు, గత తీర్పులపై పట్టు సాధించడంతో పాటు, సరైన విషయాల కోసం ధైర్యంగా పోరాడాలని చెప్పారు. ఇతరుల బాధలను అర్థం చేసుకునే గుణం కూడా ఉండాలని సూచించారు. వృత్తిలో సౌలభ్యం కోసం తమ సూత్రాలను పక్కన పెట్టకూడదని, సులభమైన మార్గాల కోసం తప్పు నిర్ణయాలు తీసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. చదువుకున్న విద్యాసంస్థలో నేర్చుకున్న విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని చెప్పారు. న్యాయవాద వృత్తి ద్వారా సమాజంలో ఎన్నో మార్పులు తీసుకురావచ్చని సూర్యకాంత్ తెలిపారు. అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయడం, వ్యక్తుల



స్వేచ్ఛను కాపాడటం, రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా ఎంతో సంతృప్తి పొందవచ్చని అన్నారు. విద్యార్థులు న్యాయవాదులుగా తమ బాధ్యతలను నిర్వర్తించడానికే పరిమితం కాకూడదని సీజేఐ సూచించారు. దేశానికి, సమాజానికి కూడా తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవిద్య పూర్తి చేసుకుని బయటకు వెళు తున్న విద్యార్థులు కేవలం చట్టపరమైన విషయాల్లోనే కాకుండా, ప్రజల్లో ఆశలు నింపే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. "న్యాయవాద వృత్తి పిరికివారి కోసం కాదు. చట్టాలు, న్యాయస్థానలు గతంలో ఇచ్చిన తీర్పులపై పట్టు ఉండడం మాత్రమే సరిపోదు. న్యాయమైన దానిని సమర్థించే ధైర్యం, నిజాయితీ ఉండాలి. న్యాయవాదులకు మేధస్సు ఉంటే సరిపోదు. నిష్పాక్షికత కూడా అవసరం. ఇతరుల వాదనలు వినాలి. ఎదుటి వ్యక్తి గౌరవాన్ని కించపరచకుండానే వారితో విభేదించగలగాలి. నైతిక బాధ్యత కలిగి ఉండాలి. అంతేకాదు ఎంతటి ఒత్తిడినైనా తట్టుకొని స్థిరంగా నిలబడగలగాలి. వృత్తి జీవితంలో ఎక్కడా రాజీపడకూడదు. విలువలకు కట్టుబడి ఉండాలి. నిజాయితీగా ఉంటేనే ఈ వృత్తిలో కీర్తి సుస్థిరంగా ఉంటుంది. రాజీపడాలనే ఆలోచనలు, ప్రలోభాలు, స్వప్రయోజనాలను విడిచిపెట్టాలి. ఒకవేళ అలాంటి సందర్భాలు ఎదురైతే లా కాలేజీల్లో నేర్పిన జ్ఞానాన్నే మీ దిక్సూచిగా చేసుకొని, మీరు ఇక్కడ నేర్చుకున్న విలువలకు కట్టుబడి ఉంటాలి. మీరు ఈ విద్యాలయం నుంచి బయటకు వెళ్తున్నప్పుడు, కేవలం ఒక వృత్తిలోకి వెళ్లడం లేదు. స్వయంప్రతిపత్తికి సంరక్షకులుగా, ప్రజల సేవకులుగా వెళు తున్నారు. చట్టం మీ సహనాన్ని, నైతికతను పరీక్షిస్తుంది. కానీ తప్పులను సరిదిద్దడం, స్వేచ్ఛను పరిరక్షించడం, రాజ్యాంగాన్ని నిలబెట్టడం మొదలైనవి మీకు సంతృప్తిని అందిస్తాయి."

**ఆ విద్యార్థినికి నివాళులు**

ఈ స్నాతకోత్సవంలో దివంగత ఊర్వశి కృష్ణత్రాకు సీజేఐ సూర్యకాంత్ నివాళులు అర్పించారు. ఆమె తన ఎల్ఎల్బీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ పొందడానికి ముందే మరణించారు. "ఆమె ఈ రోజు ఇక్కడ ఉండి ఉంటే, ఈ డిగ్రీని అందుకుంటూ, తను సాధించిన డిగ్రీ గురించి తన సహచరులతో పంచుకునేది" అంటూ ఆమె కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సీజేఐ తన సంతాపం తెలియజేశారు. గ్రాడ్యుయేట్లను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాత్రను ఈ సందర్భంగా సీజేఐ గుర్తుచేశారు. విద్యార్థుల విజయాలు వారి కుటుంబాల త్యాగాలు, మద్దతు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "మీరు ఈ ప్రపంచంలోకి అడుగుపెడు తున్నప్పుడు, దేశం మిమ్మల్ని కేవలం న్యాయవాదులుగానే కాకుండా, ఆశాకిరణాలుగా చూస్తుంది. అందువల్ల మీ వృత్తి జీవితంగా ఉజ్వలంగా, మీ ప్రయత్నాలు ప్రభావవంతంగా, మీ సేవలు శాశ్వతంగా నిలవాలని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

# నిలకడగా అడ్వాణీ ఆరోగ్యం
# హెల్త్ బులిటెన్ విడుదల చేసిన ఆసుపత్రి

ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చేరిన బీజేపీ అగ్రనేత, మాజీ ఉపప్రధానమంత్రి ఎల్?కే అడ్వాణీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నామని తెలిపాయి. శుక్రవారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురైన అడ్వాణీని ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ఆయన న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఆసుపత్రి ఒక ప్రకటనలో తెలిపింది.

98 ఏళ్ల వయసున్న అడ్వాణీ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ఏడాది మేలో కూడా వయో సంబంధిత సమస్యలతో ఆయన ఇదే ఆసుపత్రిలో చేరారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా అడ్వాణీ నివాసానికి వెళ్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మోదీతో అప్యాయంగా మాట్లాడిన అడ్వాణీ కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ ఆసుపత్రిలో చేరారు. అయితే, అడ్వాణీ హెల్త్? కండీషన్? గురించి తెలుసుకున్న పలువురు రాజకీయ నేతలు, ఆయన అభిమానులు అడ్వాణీ త్వరగా కోలుకోవాలని, పూర్తి ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారు.

**బీజేపీ వ్యవస్థాపక నేతల్లో ఒకరు**

ఎల్కే అడ్వాణీ పూర్తి పేరు లాల్‌కృష్ణ అడ్వాణీ. దేశ



రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు కీలక పాత్ర పోషించారు. అంతేకాదు, కేంద్రంలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చరిత్రలోనే అత్యంత ప్రముఖమైన అగ్ర నాయకుల్లో ఒకరిగా నిలిచారు. ప్రారంభంలో ఒక చిన్న రాజకీయ శక్తిగా ఉన్న బీజేపీని, దేశంలోనే అధికార పీఠాన్ని కైవసం చేసుకునే స్థాయికి చేర్చడంలో ఆయన పోషించిన పాత్ర కీలకం.

1927 నవంబర్ 8న ఉమ్మడి భారతదేశంలోని కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్?లో ఉంది) నగరంలో జన్మించిన అడ్వాణీ, చిన్న వయసులోనే దేశ విభజన తర్వాత భారతదేశానికి వలస వచ్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (=ూ) ద్వారా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి నిబద్ధత గల నాయకుడిగా ఎదిగారు. దేశవ్యాప్తంగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయడంలో అడ్వాణీ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 1990లో ఆయన చేపట్టిన దేశవ్యాప్త రామ రథయాత్ర భారత రాజకీయాల్లోనే ఒక చరిత్రాత్మక మలుపుగా నిలిచింది. అంతేకాదు, బీజేపీ రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించడంలో సహాయపడింది. అలా బీజేపీ చరిత్రలోనే అత్యంత ప్రముఖ నాయకుల్లో ఒకరిగా నిలిచారు.

**ఉపప్రధానిగా భాధ్యతలు చేపట్టి**

అలాగే, పరిపాలనా రంగంలోనూ అడ్వాణీ తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. 2002 నుంచి 2004 వరకు అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ నేతృత్వంలోని ప్రభుత్వంలో భారతదేశ ఉప ప్రధానమంత్రిగా అడ్వాణీ సేవలు అందించారు. తన రాజకీయ జీవితంలో ఆయన కేంద్ర హోం వ్యవహారాలతో సహా పలు కీలక బాధ్యతలు చేపట్టి, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**భారత రత్న, పద్మ విభూషణ్ పురస్కారాలు**

భారత ప్రజా జీవితానికి, దేశ ప్రగతికి అడ్వాణీ చేసిన అసాధారణ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం, దేశ అత్యున్నత పురస్కారాలతో ఆయన్ను సత్కరించింది. 2024వ సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న'ను ప్రదానం చేసింది. అంతకుముందు, 2015లో ఆయనకు దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మ విభూషణ్' వరించింది. ప్రస్తుతం ఆయన బీజేపీలో ఒక సీనియర్? నాయకుడిగా, పార్టీ రాజకీయ చరిత్రలో కీలక వ్యక్తిగా కొనసాగుతున్నారు.

# సీఆర్పీఎఫ్ జవాన్లకు గుడ్ న్యూస్

కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగం (సీఆర్పీఎఫ్) జవాన్ల పదోన్నతుల్లో నెలకొన్న తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ఒక కీలక ప్రతిపాదనను సిద్ధం చేసింది. సుమారు మూడు దశాబ్దాల క్రితం రద్దు చేసిన 'లాన్స్ నాయక్', 'నాయక్' ర్యాంకులను తిరిగి ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, కానిస్టేబుల్ స్థాయి నుంచి పదోన్నతుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న లక్షలాది మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. ఈ ప్రతిపాదనపై సిబ్బంది అభిప్రాయాలను సేకరించేందుకు సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం తక్షణ చర్యలు చేపట్టింది. కేవలం రెండు రోజుల్లో వ్యవధిలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్లలో 'సైనిక్ సమ్మేళన్'లు నిర్వహించి, జవాన్ల ఫీడ్‌బ్యాక్ సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దాదాపు 3.25 లక్షల మంది సిబ్బంది కలిగిన సీఆర్పీఎఫ్‌లో ఈ ప్రతిపాదనపై ప్రస్తుతం విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం సీఆర్పీఎఫ్‌లో ఒక కానిస్టేబుల్ తన మొదటి పదోన్నతిని (హెడ్ కానిస్టేబుల్‌గా) అందుకోవడానికి సగటున 22 నుంచి 25 ఏళ్ల సమయం పడుతోంది. ఈ సుదీర్ఘ నిరీక్షణ సిబ్బందిలో నైరాశ్యం నింపుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల మధ్య లాన్స్ నాయక్, నాయక్ అనే రెండు అదనపు ర్యాంకులను సృష్టించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 1997లో ఈ ర్యాంకులను రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో విలీనం చేశారు. అయితే, భారత సైన్యంలో ఈ ర్యాంకులు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం. ఈ ఏడాది చివరి నాటికి



సైన్యంలో నాలుగేళ్ల సేవలు పూర్తిచేసుకుని మొదటి బ్యాచ్ అగ్నివీరులు పదవీ విరమణ చేయనున్నారు. వీరు కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు అర్హత కలిగి ఉంటారు. ఈ తరుణంలో సీఆర్పీఎఫ్‌లో పదోన్నతులు వేగంగా లభిస్తాయనే భరోసా కల్పించడం ద్వారా, నైపుణ్యం గల అగ్నివీరులను పెద్ద సంఖ్యలో ఆకర్షించవచ్చని బలగం భావిస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనపై మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణీత కాల పరిమితిలో పదోన్నతులు కల్పిస్తేనే ఈ సంస్కరణలకు నిజమైన ఫలితం ఉంటుందని పారామిలిటరీ మాజీ సిబ్బంది సంఘం నేత ఒకరు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో, కొత్త ర్యాంకుల వల్ల బెటాలియన్ క్రమశిక్షణకు, ఆపరేషనల్ విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఓ సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు. మొత్తానికి, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు, అగ్నివీరుల చేరికకు మార్గం సుగమం చేసే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తోంది.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ

**- ఖానాపురం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి**

ఖానాపురం అక్టోబర్ 17( మల్లేష్ వార్త ప్రతినిధి ) :



సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రజలకు తెలుగింటి ఆడపడుచులకు ఖానాపురం పిహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోతి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందన్నారు.

తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడబిడ్డలు ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాల సిరులు కురిపించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, ఆకాంక్షించారు.

## పంచాయతీ పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ చేసిన కాళిదాస్.



మనోహరాబాద్ అక్టోబర్ 17 మన మీ వార్త ప్రతినిధి

మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ కాళ్ళకల్ గ్రామంలో గ్రామపంచాయతీలో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు దసరా కానుకగా బట్టలు పంపిణీ చేసిన మాజీ ఉపసర్పంచ్ కాళీదాస్ 13 వ వార్డు సభ్యురాలు సృజన కాళిదాసు కుటుంబ సమేతంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రతి సంవత్సరం బట్టలు ఇప్పియడం వలన ఆయన కుటుంబానికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ఇవ్వాలని పరిశుద్ధ కార్మికులు తెలిపారు.

## యూపీ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ వ్యూహం..



రానున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరా ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచా రం. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, పుష్కర్ సింగ్ ధామి నేతృత్వంలోనే పార్టీ ఎన్నికల బరిలోకి దిగాలని నిశ్చయించినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే బీజేపీ కేంద్ర నాయకత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వానికి, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వానికి మధ్య సమన్వయ లోపం, విభేదాలు ఉన్నాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ గత కొంతకాలంగా విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, యోగి నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించడం ద్వారా, పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ప్రస్తుత నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని బలమైన సంకేతాలను పంపినట్లయింది. 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 403 స్థానాలకు గాను 300కు పైగా సీట్లు సాధించి బీజేపీ ప్రభంజనం సృష్టించగా, యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఆ తర్వాత 2022 ఎన్నికల్లోనూ 255 స్థానాలతో బీజేపీ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే, ఇటీవలి 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీ ప్రదర్శన కొంత నిరాశపరిచింది. 2019లో 62 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్న పార్టీ, ఈసారి కేవలం 33 స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల అనంతరం రాష్ట్ర నాయకత్వం మార్పుపై చర్చలు జరిగినప్పటికీ, అధిష్ఠానం మాత్రం యోగి వైపే మొగ్గు చూపడం గమనార్హం. మరోవైపు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామికి పార్టీ అధిష్ఠానం నుంచి పూర్తిస్థాయి మద్దతు లభించింది. 2021 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న ఆయన, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలతో పార్టీని విజయతీరాలకు చేర్చారు. వీటికి తోడు, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని మొత్తం ఐదు స్థానాలను బీజేపీ వరుసగా మూడోసారి క్లీన్‌స్వీప్ చేసింది. ఈ వరుస విజయాలు ధామి నాయకత్వాన్ని పార్టీలో మరింత సుస్థిరం చేశాయి. తాజా నిర్ణయాలతో రెండు కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నాటికి నాయకత్వంపై నెలకొన్న సందిగ్ధతకు బీజేపీ అధిష్ఠానం తెరదించింది. ముందుగానే నాయకత్వ ముఖచిత్రాలను ప్రకటించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో స్పష్టతనిస్తూ, ఎన్నికల ప్రచారంలోకి దూసుకెళ్లేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

## ఆన్‌లైన్ గేమింగ్ ముఠా గుట్టురట్టు

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్, సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్, ముంబై, పుణే, మెహసానా, సూరత్ నగరాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో మనీలాండరింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని గుర్తించినట్లు ఈడీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నిర్వహించిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ౖమీూ) కింద, ఈ కేసుతో సంబంధం ఉన్న పలు సంస్థలు, వ్యక్తుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు పేర్కొంది. "ఆల్ ప్యానెల్ ఎక్స్ఛేంజ్", "వీ+వీ91" అనే ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకుని మోసం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో భాగంగా గతంలో పుణె, ముంబై, బెంగళూరు నగరాల్లో సోదాలు జరిపిన అధికారులు, ఎడ్సమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రామ్ యూ రాంధానిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. బాధితుల నుంచి సేకరించిన నిధులను రాంధానికి చెందిన పుణె సంస్థ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. రాంధాని సంస్థ "ఐపైసా" (ఖుఖుఅఖు) అనే ప్రత్యేక పేమెంట్ ప్లాట్‌ఫామ్‌ను సృష్టించి, దాని ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆపరేటర్ల కోసం 200కు పైగా షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా లావాదేవీలు నడిపినట్లు ఈడీ గుర్తించింది. ఈ బెట్టింగ్ సిండికేట్ కార్యకలాపాలు దుబాయ్ కేంద్రంగా సాగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలకు, నిధుల మళ్లింపునకు కొన్ని సహకార బ్యాంకులు కూడా సహకరించినట్లు ఈడీ అనుమానిస్తోంది.

# ఫిబ్రవరి నెలలోనే వేసవి పరిస్థితులు

-మొదటిపేజీ తరువాయి

లోటు నమోదవుతుండగా, వెచ్చని శీతాకాలంతో రబీ పంటలపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని తెలిపింది. నేలలో తేమ తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం, రిజర్వాయర్లలో నీరు అడుగంటిపోవడం కారణంగా రాబోయే రబీ పంటలతో పాటు ఆ తర్వాత వచ్చే వేసవి పంటలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొంది. అయితే ఇప్పటికే వరి, చెరకు, పత్తి వంటి పంటల సాగులో గణనీయంగా లోటు కనిపిస్తోంది.



**అత్యంత వేడి నెలగా ఆగస్టు 2026**

'భారత్‌పై ఎల్‌నినో ముప్పేట ముప్పు' పేరిట క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేసింది. ఇందులో ఎల్‌నినోకు తోడుగా వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కలిసి ఉష్ణోగ్రతలను గణనీయంగా పెంచడంతోపాటు నీటి సంక్షోభం మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. 2024లో నమోదైన రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలను 2026–27 ఏడాది తిరిగి రాస్తుందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఎల్?నినో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, దీని ప్రభావం 2027లోనూ కొనసాగుతుందని నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా 1901 తర్వాత 2026 ఆగస్టు అత్యంత వేడి నెలగా నిలిచిందని పేర్కొంది.

**దేశంలో 44 శాతం జిల్లాల్లో అత్యంత లోటు వర్షాలు**

నైరుతి రుతుపవనాలు గత పదేళ్లలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉన్నాయి. దీంతో 13 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక దేశవ్యాప్తంగా 44 శాతం జిల్లాల్లో అత్యంత లోటు ఏర్పడింది. వర్షాభావంతోపాటు సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్ల వడగాల్పుల తీవ్రత పెరుగుతోంది. ఈ అధిక ఉష్ణోగ్రతలు మానవుల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్రలో కరవు పరిస్థితులు తలెత్తాయి.

ఎల్‌నినోతో వరి, గోధుమ, పత్తి, చెరకు వంటి పంటలపైనే కాకుండా జలవిద్యుత్ ఉత్పత్తికి కూడా తీవ్ర అంతరాయం కలుగుతోంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ 2026–27 సంవత్సరానికి ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యాన్ని 373.93 మిలియన్ టన్నులుగా నిర్ణయించింది. ఇది ముందు సంవత్సరంతో పోలిస్తే 2.63 మిలియన్ టన్నులు తక్కువ.

**1901 తర్వాత అత్యంత తీవ్రంగా**

ఎల్‌నినోతో దేశంలో వర్షపాతంపై ప్రధానంగా ఆధారపడే దక్షిణ ద్వీపకల్పం, తూర్పు-ఈశాన్య ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. తూర్పు-ఈశాన్య ప్రాంతాల్లో 1901 తర్వాత అత్యంత కనిష్ఠ వర్షపాతం నమోదైంది. గత పదేళ్లలో తొమ్మిదేళ్లు ఈ ప్రాంతాల్లో ప్రతికూల వర్షపాత పరిస్థితులే ఉంటున్నాయి. ఇక దక్షిణ ద్వీపకల్పంలో సాధారణ వర్షపాతం 716 మిల్లీమీటర్లు కాగా 542 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఇది 1901 తర్వాత నమోదైన నాలుగో అత్యల్ప వర్షపాతం. ఈ ప్రాంతంలో 1918లో 435.8 మిల్లీమీటర్ల అత్యంత తక్కువ వర్షాపాతం నమోదైంది. ప్రస్తుతం తెలంగాణలో 18 శాతం, కర్ణాటకలో 30 శాతం, కేరళలో 28 శాతం, ఏపీలో 25 శాతం, తమిళనాడులో 20 శాతంగా వర్షపాత లోటు ఉంది. రాయలసీమ ప్రాంతంలో ఈ లోటు 40 శాతంకాగా కర్ణాటకలోని రామనగర జిల్లాలో ఏకంగా 91 శాతం లోటు నెలకొంది.

**ఈ మూడు పంటలపై అధిక ప్రభావం**

ఎల్‌నినో ప్రభావం ముఖ్యంగా మూడు పంటలపై తీవ్రంగా చూపుతోంది. తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అక్టోబర్ 5 నాటికి అందిన గణాంకాల ప్రకారం వరి, చెరకు, పత్తి సాగు విస్తీర్ణం తగ్గింది. 2025–26 కంటే పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు పెరిగింది. దీంతో తక్కువ వర్షపాతాన్ని తట్టుకోగల ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు చూపారని తెలుస్తోంది. ముఖ్యంగా వరి సాగు విస్తీర్ణంలో భారీ తగ్గుదల నమోదైంది. తెలంగాణలో 4.26 లక్షల హెక్టార్లు తగ్గింది.

## ఎల్ నినో దెబ్బ.. అందని ద్రాక్షగా మారిన సీతాఫలం..

# మార్కెట్‌లో కనిపించని జాడ

శీతాకాలం ప్రారంభమైందంటే చాలు పల్లె గుట్టల్లో, రోడ్ల వెంట, మార్కెట్లలో సీతాఫలాలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సీతాఫలం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిపోయింది. చలికాలం మొదలై దాదాపు నెల కావస్తున్నా ఇంకా మార్కెట్లో సీతాఫలాల జాడ మాత్రం కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం కాపు తగ్గిపోవడం. అవును, ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు లేక, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పట్టిన పూత పిందె దశకు కూడా రాకముందే వాడిపోతోంది.

దీనివల్ల దిగుబడి చాలా వరకు తగ్గిపోయింది. దానికి తోడు చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో సహజంగా పెరిగే చెట్లను నరికివేయడంతో సీతాఫలాల దిగుబడి మరింత పడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సీతాఫలాల సాగు కొనసాగుతోంది. అయితే అక్కడి నుంచి మార్కెట్‌కు వచ్చే పండ్లకు కూడా డిమాండ్ భారీగా పెరిగిపోయింది. సరఫరా తగ్గి డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం మార్కెట్లో సీతాఫలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. హైదరాబాద్‌లో ఒక్కో పండు నాణ్యతను బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు పలుకుతోంది.



దీంతో సామాన్యులు వీటిని కొనేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు.

**పూత దశలోనే దెబ్బ**

సాధారణంగా వర్షాకాలంలో కురిసే వర్షాల వల్ల భూమిలో తేమ పెరిగి, శీతాకాలం నాటి పరిస్థితులకు అనుగుణంగా సీతాఫలాల దిగుబడి ఉంటుంది. ఇవి ఎక్కువగా కాయాలంటే వర్షంతో పాటు నేలలో తేమ కూడా చాలా అవసరం. కానీ గడిచిన వర్షాకాల సీజన్‌లో వర్షాలు లేకపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు కూడా భారీగా పెరగడంతో చెట్టుకు పూసిన పూత పిందె దశకు చేరకుండానే నేలరాలిపోతోంది. కొన్ని చెట్లు ఈ దశను దాటి కాయ వరకు వచ్చినా, ఆ తర్వాత ఎండిపోయి రాలిపోతున్నాయి. దీనివల్ల సాధారణంగా చెట్టుకు 50–60 వరకు కనిపించాల్సిన కాయలు ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయాయి.

**ఇది కూడా ప్రధాన కారణం..**

సీతాఫలాల లభ్యత తగ్గడానికి కేవలం వాతావరణ పరిస్థితులు మాత్రమే కారణం కాదు. సీతాఫలం చెట్లు ఎక్కువగా పెరిగే ప్రాంతాలను అభివృద్ధి పేరుతో చదును చేసి వెంచర్లు వేయడం, కళాశాలలు, భవనాలు నిర్మించడం కూడా వాటి ఉత్పత్తికి ఆటంకంగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సీతాఫలాల లభ్యత మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# విద్యుత్ డిమాండ్‌పై ప్రత్యేక దృష్టి

-మొదటిపేజీ తరువాయి

ప్రభావం కనిపిస్తున్న వేళ నీరు, విద్యుత్ వంటి కీలక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' అవార్డుల ప్రదానోత్సవానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా యువ కళాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే అంశాలపై లఘుచిత్రాలు, పాటలు, ఇతర సృజనాత్మక కార్యక్ర మాల ద్వారా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో అక్టోబర్ నెలలోనే విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాధా రణంగా వాతావరణ పరిస్థితులను బట్టి విద్యుత్ వినియో గంలో మార్పులు చోటుచేసుకుంటాయని, అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను వినియోగించుకోవడం తోపాటు అనవసర వాడకాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఇంటి నుంచి కార్యాలయం వరకు విద్యుత్ వృథాను అరికట్టేలా ప్రజలు అలవాట్లు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అవసరం లేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయడం, విద్యుత్ ఆదా చేసే పరికరాలను వినియోగించడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా సమిష్టిగా పెద్ద ప్రయోజనాన్ని అందిస్తాయని వివరించారు. నీటి విషయంలోనూ వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న వనరులను భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించుకోవాలని సూచించారు.

**ప్రజల్లోకి బలమైన సందేశం తీసుకెళ్లాలి**

సినిమాలు, లఘుచిత్రాలు, పాటలు ప్రజలపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా యువత రూపొందించే సృజనాత్మక కంటెంట్ ద్వారా సామాజిక అంశాలను సులభంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చున్నారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను కథాంశాలుగా తీసుకుని ప్రజలకు అర్థమయ్యే రీతిలో రూపొందించాలని యువ ఫిల్మ్ మేకర్స్‌కు సూచించారు. తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, యువ కథానాయకులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రముఖులు ఇచ్చే సందేశాలకు విస్తృత ప్రచారం లభించే అవకాశం ఉన్నందున, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై వారు తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు.

**ప్రతిభావంతులకు ప్రోత్సాహం**

ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్' పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఔత్సాహిక దర్శకులు, కళాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. లఘుచిత్రాలతోపాటు ప్రభుత్వ పథకాలపై రూపొందించిన పాటల విభాగాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారికి తగిన గుర్తింపు కల్పించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన యువ దర్శకులను కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు అభినందించారు. కొత్త ఆలోచనలతో ముందుకు వస్తున్న యువతకు సరైన వేదికలు లభిస్తే వారు మరింత ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సామాజిక అంశాలను వినూత్నంగా తెరకెక్కించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడవచ్చని పేర్కొన్నారు.

**యువతకు అండగా నిలుస్తాం: దిల్ రాజు**

ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న యువతను ఎవరూ ఆపలేరని అన్నారు. తమ ఆలోచనలను సృజనాత్మకంగా ఆవిష్కరించేందుకు యువ కళాకారులు నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. కొత్తవారికి అవకాశాలు కల్పించడం, వారి ప్రతిభను గుర్తించడం సినీ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇటువంటి పోటీలు యువ దర్శకుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతోపాటు, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు రూపొందించేందుకు ప్రేరణనిస్తాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు స్పందించిన యువ కథానాయకుడు విజయ్ దేవరకొండను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా అభినందించారు. సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమాల్లో సినీ ప్రముఖులు భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు.

**సందడిగా అవార్డుల వేడుక**

శిల్పకళా వేదికలో జరిగిన ఈ కార్యక్రమం కళాకారులు, సినీ ప్రముఖుల సమక్షంలో ఉత్సాహంగా సాగింది. 'క్రేజీ కల్యాణం' చిత్ర బృందం హాజరై వేడుకలో సందడి చేసింది. యువ ఫిల్మ్ మేకర్స్ తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలిచింది. నీరు, విద్యుత్ పొదుపు వంటి ప్రజా ప్రయోజన అంశాలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న సందేశంతో కార్యక్రమం ముగిసింది. యువ కళాకారులు తమ సృజనాత్మకతను కేవలం వినోదానికే పరిమితం చేయకుండా, సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించేందుకు కూడా వినియోగించాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు.

## బ్యారేజీల మరమ్మతుపై తర్జనభర్జన!

-మొదటిపేజీ తరువాయి

ఆలోచిస్తోంది. నిర్మాణం చేసిన సంస్థలకే ఇవ్వడం వల్ల అన్నింటిపై అవగాహన ఉంటుందనే అభిప్రాయాన్ని కొందరు ఇంజినీర్లు వ్యక్తం చేస్తున్నారు.

**మరమ్మతుల ఖర్చులన్నీ భరించేది ఎవరు?**

మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగిన ఘటనపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీపై క్రిమినల్ చర్యకు సిఫార్సు చేయడంతోపాటు పునరుద్ధరణకు అయ్యే ఖర్చును కూడా సంస్థే భరించాలని నివేదికలో పేర్కొంది. బ్యారేజీ మరమ్మతు ఖర్చుని నిర్మాణ సంస్థే భరించాలని, లేదంటే ప్రభుత్వం వ్యయం చేసి నిర్మాణ సంస్థ నుంచి వసూలు చేయాలని జస్టిస్? పీసీ ఘోష్? కమిషన్? కూడా సిఫార్సు చేసింది. ఈ సంస్థకు పని పూర్తయినట్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు విచారణకు ఆదేశించింది. ఏడో బ్లాక్? దెబ్బతిన్నప్పుడు పునరుద్ధరణ బాధ్యత తమదే అని పేర్కొన్న ఎల్? అండ్? టీ, తర్వాత నిర్మాణం పూర్తయి వినియోగం కూడా జరిగిందని, ఈ బాధ్యత తమది కాదని పేర్కొంది. పెండింగ్?లో ఉన్న రూ.470 కోట్ల తుది బిల్లును చెల్లించాలని కూడా కోరింది. నిర్వహణ సమయంలోనే ప్రాజెక్టుకు మరమ్మతుల గురించి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదని, అప్పుడు పట్టించుకొని ఉంటే బ్యారేజీకి ఇంత తీవ్ర నష్టం జరిగేది కాదని ఇంజినీర్లు చెబుతున్నారు. డిఫెక్ట్? లయబిలిటీ పీరియడ్?లోనే ఉన్నందున గత ఒప్పందంలో తెలిపిన పనులకు మరమ్మతుల బాధ్యత ఈ సంస్థదేనని, అదనంగా పనులు చేయాల్సి వస్తే ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

**తుది నిర్ణయం మంత్రివర్గంపై ఆధారపడి ఉంది**

అన్నారం బ్యారేజీలో నిర్మాణ సంస్థ అఫ్కాన్స్‌కు డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ పూర్తయింది. ఈ సంస్థకు తుది బిల్లు రూ.170 కోట్లు పెండింగ్‌లో ఉంది. ఈ మొత్తం చెల్లించాలంటూ సంస్థ నోటీసు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లింది. సుందిళ్ల బ్యారేజీలో మాత్రం డిఫెక్ట్? లయబిలిటీ పీరియడ్? ఇంకా ఉన్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. దీనివల్ల బ్యారేజీ నిర్మాణం చేసిన నవయుగకే అదనపు పనులు అప్పగించాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ తుది నిర్ణయం మంత్రివర్గంపై ఆధారపడి ఉంటుందని, పలు ప్రత్యామ్నాయాలతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని నీటిపారుదల శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

## హనుమకొండలో ఐటీ టవర్స్



-మొదటిపేజీ తరువాయి

ఓరుగల్లు ప్రజలకు శుభవార్త తెలిపారు. త్వరలో హనుమకొండలో ఐటి టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు. హనుమకొండ హాఫ్ మారథాన్ రన్‌తో సందడిగా మారింది. హయగ్రీవచారి మైదానం నుండి 5 కి,మీ, 10 కి.మీ, 21 కి.మీ మారథాన్ రన్ నిర్వహించారు. వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన తనయుడు విశాల్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారథాన్ లో వేలాదిమంది యువత, విద్యావంతులు, ఉద్యోగులు, వైద్యులు, క్రీడాకారులు, వికలాంగులు కూడా పాల్గొన్నారు. హయగ్రీవచారి మైదానం లో మారథాన్ రన్ ను మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు చక్కటి సందేశం ఇచ్చిన మంత్రి.. ఓరుగల్లు ప్రజలకు తీపి కబురు చెప్పారు. త్వరలో హనుమకొండలో ఐటి టవర్స్ నిర్మిస్తామని ప్రకటించారు

అనంతరం హనుమకొండలో ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్థానిక టీ దుకాణం వద్ద ఆగి టీ తాగుతూ సందడి చేశారు. నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలతో బిజీగా ఉండే ప్రజాప్రతినిధులు ఇలా రోడ్డుపక్కన సాధారణ టీ స్టాల్ వద్ద కనిపించడంతో ఆ దృశ్యం ఆసక్తిని రేకెత్తించింది. హాఫ్ మారథాన్ ఉత్సాహం మధ్య టీ కప్పుతో కాసేపు సరదాగా గడిపిన నేతల దృశ్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది

## భవన నిర్మాణ పనులకు తాగునీరు వాడొద్దు
## మున్సిపల్ కమిషనర్ల కీలక నిర్ణయం



హైదరాబాద్ నగరంలో తాగునీటి కొరతను నివారించడానికి మూడు మున్సిపల్ కార్పొరేషన్లు ముందస్తు చర్యలు చేపట్టాయి. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిని పర్యవేక్షిస్తున్న కమిషనర్ జి. సృజన, కఠినమైన నిబంధనలను అమలు చేయడానికి శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. నీటి పొదుపు చర్యలను తప్పనిసరిగా పాటించాలని నిర్మాణ సంస్థలకు నోటీసులు జారీ చేయాలని, అలాగే ప్రైవేట్ మురుగునీటి శుద్ధి కర్మాగారాల (ఎస్‌టీపీల) కార్యాచరణ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి తనిఖీలు నిర్వహించాలని ఆమె పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఆదేశించారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్ ఆర్.వి. కర్ణన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి కూడా నీటి సంరక్షణ చర్యలను ప్రారంభించారు. గేటెడ్ కమ్యూనిటీలలో 339 మురుగునీటి శుద్ధి కర్మాగారాలను గుర్తించాం. పట్టణ ప్రణాళిక అధికారులు వాటన్నింటినీ తనిఖీ చేసి, వాటి కార్యాచరణ స్థితిని అంచనా వేస్తారు. అవి పనిచేయకపోతే జరిమానాలు విధిస్తాం. ఈ గేటెడ్ కమ్యూనిటీలలోని పార్కులు, పచ్చదనం నిర్వహణకు ఏ నీటిని ఉపయోగిస్తున్నారనే వివారాలు నమోదు చేస్తాం

**మున్సిపల్ కార్పొరేషన్ల నిర్ణయాలు ఇవే**

తాగునీటిని వాహనాలు కడగడానికి, ఇంటి ఆవరణ శుభ్రం చేయడానికి లేదా రోడ్లపై నీళ్లు చల్లడానికి ఉపయోగించే వారిపై జరిమానాలు విధించాలని నిర్ణయించారు. బహుళ అంతస్తుల నిర్మాణ ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మున్సిపల్ నీరు లేదా బోరు నీళ్ల వినియోగాన్ని నిలిపివేయాలి. పార్కులు, రోడ్డు మధ్య భాగాలు ఫుట్‌పాత్‌ల వెంబడి ఉన్న చెట్లకు పునర్వినియోగించిన నీటిని మాత్రమే ఉపయోగించేలా చూడాలని కమిషనర్లు పార్కుల విభాగాన్ని ఆదేశించారు. బిల్డర్లు, కాంట్రాక్టర్లు, గేటెడ్ కమ్యూనిటీలు తమ నిర్మాణ పనులకు, పచ్చదనం నిర్వహణకు మురుగునీటి శుద్ధి కర్మాగారాల(ఎస్టీపీపీ)ల నీటిని తీసుకోవలసి ఉంటుంది. ఈ నిబంధన మున్సిపల్ కార్పొరేషన్లు ఆధ్వర్యంలోని అన్ని సంస్థలకు కూడా వర్తిస్తుంది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో దశలవారీగా ఇంకుడు గుంతలు తవ్వాలి.



# వాళ్లు క్లిక్ అయ్యారు.. మరి ఏ జూడ్ ఏం చేస్తాడో?

తెలుగులో బోలెడంత మంది యూట్యూబర్లు ఉన్నారు. రోజువారీ దైనందిన విషయాల గురించి ప్రతిరోజూ వీడియోలు చేస్తూ 'ఏ జూడ్' అనే ఛానెల్‌తో అజయ్ అనే యూట్యూబర్ గుర్తింపు తెచ్చుకున్నాడు. గత రెండు వారాలుగా ఎలాంటి వీడియోలు గానీ పోస్టులు గానీ పెట్టని ఇతడు.. సడన్‌గా హీరో అయిపోయాడు. శనివారమే ఇతడి మూవీ లాంచ్ అయింది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. రాము కొప్పుల దర్శకత్వంలో నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల నిర్మిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతమందిస్తున్నాడు. యూట్యూబ్ కమ్యునిటీ నుంచి వచ్చి హీరో అయినవాళ్లలో ఏ జూడ్ మొదటివాడేం కాదు. లిటిల్ హార్ట్ ఫేమ్ మౌళి, సుహాస్, సుమంత్ ప్రభాస్ తదితరులు.. యూట్యూబ్ నుంచి ఇండస్ట్రీలోకి వచ్చి నిలదొక్కుకున్నవాళ్లే. మరి వీళ్లలా అజయ్ అలియాస్ ఏ జూడ్ సక్సెస్ అవుతాడా లేదా అనేది చూడాలి?

# 'ఐ హేట్ మ్యారేజ్' టీజర్ విడుదల.. జెన్ జీ ఆలోచనలతో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్!



నేటి తరంలో ప్రేమ, పెళ్లి, కెరీర్ మరియు స్వతంత్ర జీవనంపై యువత ఆలోచనలను ప్రతిబింబిస్తూ తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఐ హేట్ మ్యారేజ్' సుగి విజయ్, జుప్సీ భద్ర జంటగా నటిస్తున్న ఈ చిత్రంతో పరమేశ్ రేణుకుంట్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆర్య సినిమా బ్యానర్‌పై మాదం దయానంద్, కార్తిక్ వెంపటి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన 'అప్పుడే పెళ్లా' లిరికల్ వీడియో సాంగ్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభించడమే కాకుండా ట్రెండింగ్‌లో నిలిచింది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది. టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు పరమేశ్ రేణుకుంట్ల మాట్లాడుతూ.. "ప్రేమ, పెళ్లి, కెరీర్‌తో పాటు స్వతంత్రంగా జీవించాలనే నేటి జెన్ జెడ్ తరం ఆలోచనలు, భావజాలాన్ని వాస్తవానికి దగ్గరగా చూపించే ప్రయత్నమే ఈ చిత్రం. జీవితంలో యువత ఎదుర్కొనే భావోద్వేగాలు, నిర్ణయాలను సహజంగా ఆవిష్కరించే ప్రయత్నం ఇందులో ఉంటుంది. ప్రతి యువత ఈ సినిమాలోని పాత్రలతో కనెక్ట్ అవుతారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు ఇదొక చక్కటి అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో హారిక రాజేందర్, సాహితి కృష్ణ కీలక పాత్రల్లో నటిస్తుండగా, పృథ్వీరాజ్, రవివర్మ అడ్డూరి, ప్రభావతి, ఆశ్రిత వేముగంటి, లోహిత్ కుమార్, బేబి తమోఘ్న, రాధ రాయసం, లక్ష్మి, జాకీర్, విజయ్ కుమార్, దాసరి పద్మ రేఖ, శ్రీదేవి ఆర్రోజు, మెయిల్ రమేష్, అరుణ్ కుమార్ రెడ్డి, ఇందు, అఖండ సుధాకర్ రెడ్డి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని విజయ్ సి. కుమార్ అందించగా, సంగీతం మరియు పాటలను వరికుప్పల యాదగిరి సమకూర్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రవీణ్ ఇమ్మడి అందించగా, ఎడిటింగ్ బాధ్యతలను ఆవుల వెంకటేష్ నిర్వహించారు. ఆర్ట్ డైరెక్టర్‌గా మోహన్ జల్లా వ్యవహరించగా, అడిషనల్ డైలాగ్స్‌ను శ్రీనివాస్ తేజ అందించారు. అల్లు చాణక్య, రాజ్ కృష్ణ కొరియోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి దయానంద్ మాదం, కార్తిక్ వెంపటి నిర్మాతలుగా వ్యవహరించగా, సంతోష్ రేణికుంట్ల, కాశీగారి కోదండ రామ శర్మ సహ నిర్మాతలుగా ఉన్నారు. రచన, మాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చడంతో పాటు పరమేశ్ రేణుకుంట్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.

# పల్లెటూరి నుంచి అంతరిక్షం వరకు.. దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్!




యువ నటుడు దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్/డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' పవన్ సాధినేని దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా మేకర్స్ విడుదల చేశారు. చదువంటే ఇష్టమున్న ఒక అమ్మాయి పల్లెటూరి నేల నుంచి మొదలై ఏకంగా అంతరిక్షం వరకు సాగే ఒక అద్భుతమైన భావోద్వేగ ప్రయాణంగా ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ సరసన సాత్విక నటిస్తుండగా, శృతి హాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విభిన్నమైన కథాంశంతో, అద్భుతమైన విజువల్స్ తో రూపొందుతున్న ఈ టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.

# షూటింగ్ పూర్తి చేసుకున్న పూరి- విజయ్ సేతుపతి 'స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్!



క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' ఈ సినిమా షూటింగ్ తాజాగా కంప్లీట్ అయింది. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ మొత్తం పూర్తయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకులను భావోద్వేగాల సుడిగండంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉండబోతోందని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమేష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. విజయ్ సేతుపతి -- పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై సినిమా వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# కీర్తి సురేశ్ బర్త్‌డే స్పెషల్.. 'అక్క' యాక్షన్ ప్యాక్డ్ టీజర్ విడుదల!

టాలెంటెడ్ హీరోయిన్ కీర్తి సురేశ్ పుట్టినరోజు సందర్భంగా వరుస అప్‌డేట్లు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే వెంకీ సినిమా నుంచి క్రేజీ అప్‌డేట్ రాగా, తాజాగా ఆమె నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'అక్క' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా వస్తున్న ఈ సినిమా టీజర్ పూర్తిగా యాక్షన్ ప్యాక్‌డ్‌గా, ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్‌తో పాటు మరో టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఇద్దరు పవర్‌ఫుల్ నటీమణుల కలయికలో వస్తున్న ఈ థ్రిల్లర్ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త లుక్‌లో, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో కీర్తి సురేశ్ కనిపించనున్న ఈ టీజర్ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512